కుప్పకూలిన మామిడి వ్యాపారం

- పది శాతానికి తగ్గిపోయిన దిగుబడి
- ముందుకు రాని వ్యాపారులు
- కోడూరు, రాజంపేట ప్రాంతాల్లో పెద్దఎత్తున నష్టపోయిన మామిడి రైతులు

వర్షాలు లేక గిటకబారిపోయిన మామిడి కాయలు



ఈ ఏడాది మామిడి వ్యాపారం కుప్పకూలిపోయింది. ఇప్పటికే మూడు పువ్వులు.. ఆరు కాయలుగా ఉండాల్సిన వ్యాపారం పది శాతం కూడా లేకుండా పోయింది. కారణం మామిడి కాపు పది శాతం కూడా లేదు. డిసెంబరు నుంచి చెట్లు పూత పూసి ఏప్రిల్ నెల నుంచి విరివిగా కాయలు కాసి వ్యాపారం పెద్దఎత్తున జరిగేది. అటువంటి వ్యాపారం ఒక్కసారిగా కుదేలైంది. దీనికి కారణం ఇతర రాష్ట్రాల్లో మామిడికాయలు విరివిగా కాపు కాయడం, రైల్వేకోడూరు, రాజంపేట, వీరబల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో మామిడికాయలు తక్కువ దిగుబడి రావడమేనని వ్యాపారులు చెబుతున్నారు. రెండేళ్లుగా వర్షాలు లేకపోవడంతో అక్కడక్కడా కాసిన కాయలు కూడా కాయలు సైజు రాక గిటకబారిపోయాయి. ఇతర ప్రాంతాల్లో కాయల సైజు బాగా ఉండటం వల్ల మన ప్రాంతంలో కాసిన కాయలకు డిమాండ్ లేకుండా పోయింది. ప్రధానంగా ఉమ్మడి కడప జిల్లాలో రైల్వేకోడూరు ప్రాంతం మామిడి వ్యాపారానికి పెట్టింది పేరు. ఇక్కడ ప్రతి ఏడాది రూ.200 కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంది. ఏప్రిల్ నుంచి జూలై మాసాంతం వరకు నాలుగు నెలల పాటు ఈ వ్యాపారం బాగా జరుగుతుంది. ఢిల్లీ, మధ్యప్రదేశ్, చెన్నై, నాగపూర్, ముంబైతో పాటు దేశం లోని అన్ని ప్రాంతాలకు రైల్వేకోడూరు మామిడి పండ్లను ఎగుమతి చేస్తుంటారు. కోడూరుతో పాటు రాజంపేట ప్రాంతంలో కూడా సుమారు రూ.20 కోట్లకు పైబడి వ్యాపారం జరుగుతుంది. ఒక్క రైల్వేకోడూరులోనే సుమారు 20 వేల ఎకరాల్లో మామిడి పంట దిగుబడి వస్తుంది.




వాతావరణం అనుకూలించక పూతదశలోనే మాడిపోయిన మామిడి పూత



కోడూరు మామిడి మండిలో ఎగుమతికి సిద్ధంగా ఉన్న అరకొర మామిడి కాయలు

రాజంపేట, మే 15: ఈ ఏడాది మామిడి వ్యాపారం కుప్పకూలిపోయింది. ఇప్పటికే మూడు పువ్వులు.. ఆరు కాయలుగా ఉండాల్సిన వ్యాపారం పది శాతం కూడా లేకుండా పోయింది. కారణం మామిడి కాపు పది శాతం కూడా లేదు. డిసెంబరు నుంచి చెట్లు పూత పూసి ఏప్రిల్ నెల నుంచి విరివిగా కాయలు కాసి వ్యాపారం పెద్దఎత్తున జరిగేది. అటువంటి వ్యాపారం ఒక్కసారిగా కుదేలైంది దీనికి కారణం ఇతర రాష్ట్రాల్లో మామిడికాయలు విరివిగా కాపు కాయడం, రైల్వేకోడూరు, రాజంపేట, వీరబల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో మామిడికాయలు తక్కువ దిగుబడి రావడమేనని వ్యాపారులు చెబుతున్నారు. రెండేళ్లుగా వర్షాలు లేకపోవడంతో అక్కడక్కడా కాసిన కాయలు కూడా కాయలు సైజు రాక గిటకబారిపోయాయి. ఇతర ప్రాంతాల్లో కాయల సైజు బాగా ఉండటం వల్ల మన ప్రాంతంలో కాసిన కాయలకు డిమాండ్ లేకుండా పోయింది. ప్రధానంగా ఉమ్మడి కడప జిల్లాలో రైల్వేకోడూరు ప్రాంతం మామిడి వ్యాపారానికి పెట్టింది పేరు. ఇక్కడ ప్రతి ఏడాది రూ.200 కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంది. ఏప్రిల్ నుంచి జూలై మాసాంతం వరకు నాలుగు నెలల పాటు ఈ వ్యాపారం బాగా జరుగుతుంది. ఢిల్లీ, మధ్యప్రదేశ్, చెన్నై, నాగపూర్, ముంబైతో పాటు దేశం లోని అన్ని ప్రాంతాలకు రైల్వేకోడూరు మామిడి పండ్లను ఎగుమతి చేస్తుంటారు. కోడూరుతో పాటు రాజంపేట ప్రాంతంలో కూడా సుమారు రూ.20 కోట్లకు పైబడి వ్యాపారం జరుగుతుంది. ఒక్క రైల్వేకోడూరులోనే సుమారు 20 వేల ఎకరాల్లో మామిడి పంట దిగుబడి వస్తుంది.

ఉద్యానవన పంటలకు పెట్టింది పేరైన రైల్వేకోడూరులో కేవలం మామిడి వ్యాపారం వల్లే ప్రతి ఏడాది రూ.200 కోట్లు ఆదాయం వస్తుంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో బేనీషా, తోతాపురి, నీలం, అంటుమామిడి, పునాస, పోలూర, రుమాని తదితర రకాల మామిడి కాయలను పండిస్తారు. ప్రధానంగా ఏప్రిల్ నుంచి బేనీషా కాయలు కోయడం మొదలుపెడతారు. ప్రస్తుత సీజన్‌లో పూర్తిగా కాపు తగ్గిపోయింది. గత ఏడాది ఎక్కువ దిగుబడి రాగా ఈ ఏడాది తక్కువ దిగుబడి వచ్చింది. ఒక ఏడాది ఎక్కువ దిగుబడి వస్తే.. మరో ఏడాది తక్కువ దిగుబడి రావడం సహజ లక్షణం. దానికి తోడు పూర్తిగా వర్షాలు లేకపోవడంతో దిగుబడి కూడా తగ్గింది. కేవలం పది శాతం పంట కూడా కాయలేదు. బేనీషా టన్ను కాయలు రూ.80 వేల నుంచి 90 వేలు ఉండాల్సి ఉండగా 40 వేలు కూడా లేదు. పోలూరు టన్ను 50 వేలు ఉండాల్సి ఉండగా 25 వేలు కూడా లేదు. ఇక అంటుమామిడి కాయలు కొనేవారు లేరు. తోతాపురి, అంటుమామిడి కాయలు ఎగుమతి కావాలంటే చిత్తూరు, తిరుపతి చుట్టుపక్కల ప్రాంతాల్లో జ్యూస్ ఫ్యాక్టరీలను తెరవాల్సి ఉంది. ఎందుకనో ఏమో ఇంతవరకు ఏ జ్యూస్ ఫ్యాక్టరీ కూడా తెరవకపోవడం వల్ల అంటుమామిడికాయలను కోయలేదు. కోసినా కొనే జ్యూస్ ఫ్యాక్టరీలు లేకపోవడంతో పంట కోయడానికి సిద్ధంగా ఉన్నా ఉపయోగం లేకుండా ఉంది. నీలం కాయలు ఇంకా కోతకు రాలేదు.



కాయలు లేక వెలవెలబోతున్న మామిడి చెట్లు

ప్రధానంగా పది శాతం కూడా పంట దిగుబడి లేక మామిడి రైతులు భారీగా నష్టపోయారు. ఎకరాకు సుమారు 50 వేల రూపాయలు పైబడి మందులను పిచికారీ చేసి ఏడాది పొడవునా దుక్కులు దున్ని, ఎరువులు వేసి దిగుబడి వస్తుందన్న రైతులకు నిరాశే మిగిలింది. పది శాతం కూడా దిగుబడి రాకపోవడం, దానికి తగ్గట్టు ధరలు లేకపోవడం వల్ల మామిడి రైతులు చాలా నష్టపోవాల్సి వచ్చింది. జూలై వరకు సాగాల్సిన మామిడి వ్యాపారం కేవలం మే మాసాంతానికి పూర్తయ్యేటట్లు ఉంది. కారణం కాయలు దిగుబడి కాకపోవడమే. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని మైసూరువారిపల్లె, జంగిటివారిపల్లె, ఉర్లగట్టుపోడు, ఉప్పరపల్లె, లక్ష్మీగారిపల్లె, శెట్టిగుంట, గాదెల, వెంకటరామాపురం, టి.కమ్మపల్లె, బొమ్మవరం, చిట్వేలి, నగిరిపాడు, రాజుకుంట, కొత్తపల్లె, తిమ్మాయపాలెం, జట్టివారిపల్లె, మంగళంపల్లె, గొబ్బూరువారిపల్లె, కొండూరు, మూగావారిపల్లె, పెనగలూరు తదితర అన్ని ప్రాంతాల్లో ఈ మామిడి పంటలను సాగు చేస్తున్నారు. మామిడి తోటలు లేని గ్రామం ఇక్కడ ఉండదు. కోడూరులో మామిడి వ్యాపారం కోసమే ఒక ప్రత్యేక మామిడి మండి సముదాయం ఉంది. వారు మార్చి నెల నుంచి జూలై వరకు ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తారు. సుమారు 200 మంది వ్యాపారస్తులు ఈ మామిడి వ్యాపారంపై ఆధారపడి ఉన్నారు. ఢిల్లీ, మధ్యప్రదేశ్ ఇతర ప్రాంతాల నుంచి ప్రతి ఏడాది పెద్ద పెద్ద వ్యాపారస్తులు ఇక్కడికి వచ్చి మామిడి రైతులకు ముందుగానే సాగు ఖర్చులకు అడ్వాన్సులు ఇచ్చి కాయలు కొనుగోలు చేసి జాతీయ స్థాయిలో ఎగుమతులు చేస్తుంటారు. ప్రస్తుతం పంట దిగుబడి పది శాతానికి పడిపోవడంతో ఆ వ్యాపారస్తులు కూడా ఇటువైపు రాలేదు. ఈ విధంగా మామిడి వ్యాపారం పూర్తిగా కుప్పకూలిపోయింది. రెండేళ్లుగా వర్షాలు లేక ఇతర పంటలు సాగు చేయలేక మామిడి పంటను నమ్ముకున్న రైతన్నకు నిరాశే ఎదురైంది. వారు పెట్టిన పెట్టుబడులు కూడా కానరాకుండాపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి.

మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి..



మామిడి పంటను సాగు చేసిన రైతులు ప్రతి ఏడాది నష్టపోతూనే ఉన్నారు. మామిడి పంటను సాగు చేసిన రైతు ఎప్పుడూ లాభాలు చూసిన దాఖలాలు లేవు. కారణం కాయల దిగుబడి ఎక్కువగా ఉన్నప్పుడు డిమాండ్ ఉండదు. ధర తక్కువగా ఉంటుంది. కాయలు లేనప్పుడు ధర ఉన్నా ప్రయోజనం ఉండదు. ఈ ఏడాది కాయలు లేవు.. ధర కూడా లేదు. ఈ స్థితిలో రైతులను ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వానికి ఎంతైనా ఉంది.

- శంకరయ్య, మామిడి రైతు, గరుగుపల్లె

పది శాతం కూడా దిగుబడి కాలేదు..



ఈ ఏడాది పది శాతం కూడా పంట దిగుబడి కాలేదు. దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఎక్కువగా మామిడి దిగుబడి రావడం, మన ప్రాంతం నుంచి తక్కువ దిగుబడి రావడం వల్ల రైతులు నష్టపోయారు. దిగుబడి అయిన పది శాతం పంటకు కూడా డిమాండ్ లేకుండా పోయింది.

- కోటయ్య, ఈడిగపల్లె, మామిడి రైతు

పంట తగ్గడం.. డిమాండ్ లేకపోవడంతోనే భారీ నష్టం



ప్రధానంగా పంట పది శాతం కూడా దిగుబడి కాలేదు. దానికి తగ్గట్టు డిమాండ్ కూడా లేదు. కాయలు తగ్గి కాయలకు డిమాండ్ లేకపోవడం వల్ల రైతులు ఎకరాకు రూ.50 వేలు ఖర్చు చేసినా వారు పెట్టిన పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేదు. దీనివల్ల కోడూరులో ప్రతి ఏడాది రూ.200 కోట్లకు పైబడి జరిగే వ్యాపారం రూ.50 కోట్లు కూడా జరిగే పరిస్థితి లేదు. ఈనెల చివరికే వ్యాపారం ముగియనుంది. దీనివల్ల కోడూరు మామిడి రైతులు పెద్దఎత్తున నష్టపోయారు. ఎందుకనో ప్రధాన నగరాల్లో ఇంకా మామిడి పంటకు పెద్దగా డిమాండ్ లేదు. కారణాలేమైనా కోడూరు మామిడి రైతులు పెద్దఎత్తున నష్టపోయారు.

- రామసుబ్బారెడ్డి, మామిడి రైతు, మైలపల్లె గొల్లపల్లె



అరకొరకగా కాసివున్న మామిడి కాయలు

సమాజ భాగస్వామ్యంతో డెంగ్యూను నివారిద్దాం

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య



డెంగ్యూ నివారణ దినోత్సవం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

రాయచోటి టౌన్, మే 15: సమాజ భాగస్వామ్యంతో డెంగ్యూ వ్యాధిని నివారిద్దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య పిలుపునిచ్చారు. ఈనెల 16న గురువారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా బుధవారం ఆయన జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్, జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్‌తో కలిసి డీఎంహెచ్‌వో కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం 'సమాజ భాగస్వామ్యంతో డెంగ్యూ వ్యాధి నివారిద్దాం' అనే నినాదంతో ప్రజలకు ఆరోగ్య సిబ్బంది పూర్తిగా అవగాహన కల్పిస్తున్నారన్నారు. విపరీతమైన జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, కంటి నొప్పి, వికారం, వాంతులు, శరీరంపై ఎర్రటి దద్దుర్లు, అలసట, ముక్కుల నుంచి రక్తస్రావం, శ్వాస తీసుకోవడం కష్టం, రక్తకణాలు తగ్గడం వంటి డెంగ్యూ లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలన్నారు. జిల్లా మలేరియా అధికారి బి.వేణుగోపాల్ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి నివారణ కొరకు నీరు నిల్వ ఉన్న ప్రాంతంలో దోమ లార్వా పెరగకుండా అన్ని చర్యలు చేపడతున్నామని, డెంగ్యూ నిర్ధారణ అయితే వెంటనే ఆ గ్రామాల్లో దోమల నివారణకు పైరేత్రియం, స్ప్రేయింగ్, ఫాగింగ్ చేస్తున్నామన్నారు. డ్రైడే, ఫ్రైడే ద్వారా ప్రతి శుక్రవారం దోమలు పెరగకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యాధికారి శైలజ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉషశ్రీ, మలేరియా సబ్ యూనిట్ అధికారులు వై.ప్రసాద్‌యాదవ్, జయరామయ్య, సీహెచ్‌వోలు నారాయణ, రామకృష్ణ, బలరామరాజు, సరళ, శివారెడ్డి, పెంచలయ్య, ఈశ్వరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచితంగా బీసీజీ టీకా పంపిణీ

- 2025 నాటికి క్షయవ్యాధి రహిత జిల్లాగా రూపొందించడమే లక్ష్యం : డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య

రాయచోటి టౌన్, మే 15: జిల్లాలో క్షయవ్యాధి నివారణకు బీసీజీ ఉచిత టీకా పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 16 నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొండయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఈ ఉచిత టీకా పంపణీ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ వైద్యఆరోగ్యశాఖకు ఆదేశాలు జారీ చేశారన్నారు. జిల్లాలో 2025 నాటికి టీబీ నివారణే లక్ష్యంగా ఈనెల 16 నుంచి జిల్లాలోని అన్ని సచివాలయాల్లో ప్రతి గురువారం మూడు నెలల పాటు ప్రత్యేక శిక్షణ పొందిన ఆరోగ్య సిబ్బంది ద్వారా ఉచితంగా టీకాలు వేస్తామని తెలిపారు. 18 సంవత్సరాలుపైబడిన వారికి క్షయవ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు, మధుమేహ వ్యాధిగ్రస్తులకు, ధూమపానం సేవించే వారికి ఈ బీసీజీ ఉచిత టీకా పంపిణీ చేస్తారని తెలిపారు. సంబంధిత ఆరోగ్య సిబ్బంది, సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులు, అంగన్వాడీ సిబ్బందిని, టీబీ చాంపియన్లను సమన్వయం చేసుకుని టీకా ప్రాముఖ్యత ప్రజలకు తెలియజేసి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. అందరూ అపోహలు వీడి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి టీబీ (క్షయ) రహిత సమాజం కోసం పాటుపడాలని తెలియజేశారు. కార్యక్రమాన్ని జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారని ఆయన పేర్కొన్నారు.

బోనాలతో పోటెత్తిన మహిళలు


కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తిలో పెద్దమ్మ, చిన్నమ్మ దేవర మహోత్సవానికి మహిళా భక్తులు పోటెత్తారు. బుధవారం ఉదయం గ్రామం నలుమూల నుంచి మహిళలు భక్తిశ్రద్ధలతో మట్టికుండల్లో పెరుగన్నంతో కూడిన బోనాల(చల్ల)ను తీసుకుని వందలాది మంది వీధుల్లోనుంచి వాయిద్యాలు, తప్పెట్లతో, దరువులతో ఆలయం వద్దకు చేరుకున్నారు. బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

- యర్రగుంట్ల



బోనాలతో గుడివద్దకు వెళుతున్న మహిళలు

ఎమ్మెల్యే మేడా డ్రైవర్‌పై వైసీపీ నేతల దాడి



దాడిలో గాయపడ్డ మహేష్

రాజంపేట టౌన్, మే 15: రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కారు డ్రైవర్ మహేష్‌పై వైసీపీ నాయకులు మంగళవారం అర్ధరాత్రి సమయంలో దాడి చేశారు. వివరాల్లోకెళితే.. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంకు మద్దతు పలకడంతో అతడి డ్రైవర్ కూడా మద్దతు పలికారు. ఈ నేపథ్యంలో రాజంపేట మండలం వడ్డిపల్లి గ్రామంలో టీడీపీ మద్దతుగా ప్రచారం చేశాడు. ఇది మనసులో ఉంచుకున్న వైసీపీ నాయకులు పెంచలయ్య, కొంతమంది కలిసి ఇంటి వద్దకు వెళ్లి అతడిపై దాడి చేసినట్లు మహేష్ భార్య ఆరోపించారు. దాడిలో మహేష్ తలకు బలమైన గాయం కావడంతో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి నారాయణాద్రి ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి బాధితుడికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా పలువురు టీడీపీ నేతలు ఆయనను పరామర్శించారు. దాడి చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని బాధితులు, వారి బంధువులు కోరుతున్నారు. కాగా రాజంపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఇసుకను తోడేస్తున్నారు..!

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- చోద్యం చూస్తున్న రెవెన్యూ శాఖ
- రామానాయుని చెరువును బావులు చేసేశారు..



రామానాయుని చెరువులో ఇసుకను ట్రాక్టర్లకు లోడ్ చేస్తున్న కూలీలు

గుర్రంకొండ, మే 15: మండలంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఇసుకాసురుల అవతారమెత్తిన వైసీపీ నాయకుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. తమకు అడ్డు చెప్పే ధైర్యం ఎవరికీ లేదన్న ధీమాతో చెరువులు, కుంటలను వైసీపీ నాయకులు ఎక్స్‌కవేటర్‌ల సాయంతో తోడేస్తున్నారు. చెరువులో పదుల సంఖ్యలో ట్రాక్టర్లను ఉంచి ఇసుకను బయట ప్రాంతాలకు తరలించి వేలాది రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణాపై గ్రామస్థులు, ఆయకట్టు రైతులు రెవెన్యూ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గుర్రంకొండ మండలం తరిగొండ పంచాయతీ పరిధిలో రామానాయుని చెరువు ఉంది. రెండేళ్లుగా ఈ చెరువు నీటితో నిండి ఉండేది. గత ఏడాది వర్షాలు కురవకపోవడంతో ప్రస్తుతం చెరువు ఎండిపోయింది. ఇదే అదునుగా భావించిన ఇసుకాసురులు చెరువులో ఇసుకపై కన్నేశారు. చెరువులో ఎక్స్‌కవేటర్ సాయంతో ఇసుకను తవ్వి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. రెండు రోజులుగా రామానాయుని చెరువులో ఇసుక కోసం అక్రమార్కులు ఎక్స్‌కవేటర్‌తో తవ్వేస్తున్నారు. ఇలా ఇసుకను తవ్వి బయట ప్రాంతాలకు ఇష్టానుసారంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ.3 వేల నుంచి 4 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాపై ఆయకట్టు రైతులు, గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు తెలిపినా పట్టించుకవడం లేదని వాపోతున్నారు.

చెరువును తవ్వేస్తున్న వైసీపీ నాయకులు

తరిగొండ రామానాయుని చెరువును వైసీపీ నాయకులు చెరపట్టారు. ఎక్స్‌కవేటర్‌లను ఉంచి ఇసుక కోసం చెరువును తవ్వేస్తున్నారు. ఇసుక కోసం చెరువులో లోతైన గుంతలను చేస్తున్నారు. ఇసుకను ట్రాక్టర్లకు నింపుకుని వేలాది రూపాయలకు అమ్ముతున్నారు. ఇలా వైసీపీ నాయకులు విచ్చలవిడిగా ఇసుకను తరలిస్తున్నా పట్టించుకోనే వారు లేకపోవడం గమనార్హం.

ఎన్నికల కోడ్ వర్తించదా

రెండు నెలలుగా రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. దీంతో ఇసుక రీచ్‌లను ప్రభుత్వం సరిగా నిర్వహించలేదు. ఈ క్రమంలో నిర్మాణాలకు ఇసుక దొరకడం లేదు. ఈ నెల 13వ తేదీ ఎన్నికలు ముగియడంతో మరుసటి రోజు నుంచే ఇసుక వ్యాపారులు అక్రమ వ్యాపారం మొదలుపెట్టారు. ఇందులో తరిగొండ, టి.పసలవాండ్లపల్లె, చెర్లోపల్లె, శెట్టివారిపల్లె, గుర్రంకొండ గ్రామాల్లో ఇసుకాసురులు ఇష్టానుసారంగా ఇసుకను తరలిస్తున్నారు. ఈ క్రమంలో చెరువులు, కుంటలను తవ్వేస్తూ దోచుకుంటున్నారు. ఎన్నికల కోడ్ జూన్ నెల 4వ తేదీ వరకు ఉన్నప్పటికీ ఇసుకాసురులు కోడ్ నిమయాలను పాటించడం లేదు. జిల్లా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై తరిగొండ వీఆర్వో రెడ్డిశేఖర్‌ను వివరణ కోరగా రామానాయుని చెరువులో ఇసుక అక్రమ తవ్వకాలపై సమాచారం లేదన్నారు. చెరువు వద్దకు వెళ్లి పరిశీలించి అక్రమంగా ఇసుక తోడుతుంటే ట్రాక్టర్లను సీజ్ చేస్తామని తెలిపారు.





ఇసుక కోసం ఎక్స్‌కవేటర్‌తో తవ్విన గుంతలు

భక్తిశ్రద్ధలతో బ్రహ్మంగారి ఆరాధన


గుడి ఉత్సవంలో వీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబ

బ్రహ్మంగారిమఠం, మే 15 : కాలజ్ఞానకర్త పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన, గురుపూజా మహోత్సవాలు మంగళవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. రెండోరోజు బుధవారం స్వామి వారికి ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, 9 గంటలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణం నుంచి పురవీధుల గుండా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబ గుడి ఉత్సవాన్ని చేపట్టారు. ఉత్సవాలకు దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలకు ఏర్పాట్లు చేశామని దేవదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంటు కమిషనర్ సి.శంకరబాలాజీ తెలిపారు. భక్తులకు తాగునీరు, భోజనవసతి, విశ్రాంతి గదులతో పాటు ఆలయ ప్రాంగణంలో చలువ పందిర్లు ఏర్పాటు చేశామన్నారు. క్యూలైన్లు ఏర్పాటు చేశామని భక్తులందరికీ మంచి నీటితో పాటు మజ్జిగ ప్యాకెట్లు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భోజన వసతి ఉంటుందన్నారు. గురుపూజ మహోత్సవాలకు విచ్చేసి స్వామి వారిని దర్శించుకోవాలని తెలిపారు.

జిల్లా ప్రతిష్టను పెంచిన కట్టా నరసింహులు


కట్టా నరసింహులుకు నివాళులర్పిస్తున్న దృశ్యం

కడప (నాగరాజుపేట), మే 15 : తెలుగు సాహిత్యం, జిల్లా చరిత్రలపై ఎంతో మమకారం గల విద్వాన్ కట్టా నరసింహులు కైఫీయత్తుల పరిష్కారం ద్వారా మరుగునపడిన గొప్ప చరిత్రను వెలికితీసి జిల్లా ప్రతిష్టను ఇనుమడింపజేశారని వైవీయూ పాలక మండలి సభ్యుడు, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. బ్రౌన్ గ్రంథాలయ తొలి బాధ్యులు, కడప కైఫీయత్తుల పరిష్కర్త విద్వాన్ కట్టా నరసింహులు 3వ వర్ధంతిని పురస్కరించుకుని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు ఆధ్వర్యంలో బుధవారం ఆయన సంస్మరణ సభను నిర్వహించారు. తొలుత విద్వాన్ కట్టా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ సాహిత్యం కంటే కట్టా చరిత్ర పరిశోధనపై కృషి చేశారని, కైఫీయత్తుల పరిష్కారంతో ఆయనకు తెలుగునాట విశేషమైన పేరు ప్రతిష్టలు లభించాయన్నారు. రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యుడు డాక్టర్ తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ విద్వాన్ కట్టా నరసింహులుకు జిల్లా రుణపడి ఉందని ఆయనకు ఎంతో ఇష్టమైన బ్రౌన్ గ్రంథాలయ ఆవరణంలో బ్రౌన్ శాస్త్రి సరసన ఆయన శిలావిగ్రహాన్ని ఏర్పాటు చేయడం సమంజసంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, చిత్రకారుడు వెంకటేశ్, మధు, డేవిడ్, గొబ్బూరి కొటేశ్వరరావు, జ్యోతిజార్జి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సామర్థ్యం ఆధారంగా విద్యాబోధన

పీఏఎల్ శిక్షణ కార్యక్రమంలో ఆర్‌జేడీ, డీఈవోల సూచనలు


సమావేశంలో మాట్లాడుతున్న రాఘవరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మే 15 : విద్యార్థి సామర్థ్యం ఆధారంగా విద్యాభ్యాసం జరగాలని పీఏఎల్ ముఖ్య ఉద్దేశ్యమని పాఠశాల ప్రాంతీయ సంచాలకులు జోన్-4 వై.రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.అనురాధలు సూచించారు. బుధవారం కడప నగరం జయనగర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష ఏపీవో రజనీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కడప, అన్నమయ్య, నంద్యాల, కర్నూలు జిల్లాలోని పీఏఎల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంగ్లీషు, గణిత ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ, డీఈవోలు మాట్లాడుతూ జాతీయస్థాయిలో నోబెల్ అవార్డు గ్రహీత రాబర్ట్ మైఖేల్ క్లేమర్ ఆధ్వర్యంలో రూపకల్పన చేసిన కాన్వి జీనియస్ కంటెంట్ డెవలప్‌మెంటు ప్రోగ్రాంద్వారా ప్రపంచంలో 120 దేశాలు అమలుపరుస్తున్న పీఏఎల్ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని 564 పాఠశాలల్లో 2019 నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు వారి వైయుక్తిక బేధాలకనుగుణంగా విద్యాభ్యాసం నిర్వహించి ప్రతి విద్యార్థికి ఆ తరగతికి గల సామర్థ్యాన్ని అందే విధంగా బోధన అభ్యసనం జరగాలని సూచించారు. అనంతరం కాన్వి జీనియస్ కంటెంట్ డెవలప్‌మెంటు డిప్యూటీ మేనేజర్లు సౌరబ్‌గౌర్, ఉజ్వల్, అనిరుధ్, కిషోర్‌బాబు, పీఏఎల్ కో-ఆర్డినేటర్లు, పీఏఎల్ ఆవశ్యకతపై ఉపాధ్యాయులు, విద్యార్థులు చేయాల్సిన విధివిధానాలు కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో కడప, అన్నమయ్య, నంద్యాల, కర్నూలు జిల్లాల అధికారులు అశోక్‌రెడ్డి, దస్తగిరిరెడ్డి, జిల్లావిద్యాశాఖ, సమగ్ర శిక్ష సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి వెల్లాల బ్రహ్మోత్సవాలు




రాజుపాలెం, మే 15: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చెన్నకేశవ సంజీవరాయస్వామి, భీమలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను 19 నుంచి 27వ తేదీ సోమవారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో బీవీ నరసయ్య, చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. 20న సోమవారం కల్యాణోత్సవం, 22న బుధవారం హనుమంతోత్సవం, 23న గురువారం గరుడోత్సవం, 25న శనివారం రథోత్సవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 26న పల్లకీసేవ, 27న వసంతోత్సవం కార్యక్రమాలు ఉంటాయన్నారు. 25న శనివారం రథోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి వృషభాలకు బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. మొదటి బహుమతి రూ.1.10 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.75 వేలు, తృతీయ బహుమతి రూ.50 వేలు ఉంటుందన్నారు. చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టరు బుధవారం సంజీవరాయస్వామి దేవస్థానంలో చైర్మన్, కమిటీ సభ్యులు విడుదల చేశారు.

తలనీలాల వేలం పాట ద్వారా రూ. 13.8 లక్షల ఆదాయం

చెన్నకేశవ సంజీవరాయస్వామి భీమలింగేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం తలనీలాల వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో ఆలయ కార్యనిర్వాహణాధికారి బీవీ నరసయ్య, చైర్మన్ బుక్క సముద్రం జగదీశ్వర్‌రెడ్డి, పర్యవేక్షణాధికారి ఆర్.నరసింహ ఆధ్వర్యంలో నిర్వహించారు. హెచ్చు పాటదారు మునిశంకర్ రూ.13.8 లక్షలకు ఈ తలనీలాల వేలం పాట దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

3 టీఎంసీల దిగువన గండికోట నీటిమట్టం


గండికోటలో ప్రస్తుత నీటిమట్టం

కొండాపురం , మే 15: గండికోట ప్రాజెక్టులో నీటిమట్టం 3 టీఎంసీల దిగువకు పడిపోయింది. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో రోజురోజుకూ నీటిమట్టం తగ్గుతూ వస్తోంది. బుధవారానికి గండికోట ప్రాజెక్టులో 23.9 టీఎంసీల నీటిమట్టం ఉన్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. 202.67 అడుగుల వద్ద ఈ నీటిమట్టం ఉన్నట్లు డీఈ తెలిపారు. కాగా ప్రస్తుతం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో గానీ, ఔట్‌ఫ్లో గానీ లేదన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మహబూబ్ షరీఫ్ మృతదేహం

కాశినాయన మే 15: కాశినాయన మండలం అంబవరం గ్రామంలో బుధవారం విద్యుదాఘాతంతో కమాల్‌సాబ్‌గారి మహబూబ్‌షరీఫ్ (45) మృతి చెందినట్లు కాశినాయన ఎస్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు నివసించే రేకులషెడ్ వర్షానికి కారకుండా పట్టకప్పేందుకు పైకిఎక్కాడు. రేకులకు విద్యుత్ సరఫరా కావడంతో కరెంట్ షాక్‌తో అక్కడి కక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఎనిమిదేళ్ల కూతురు కలదు. ఆమేరకు కేసు నమోదుచేసి శవాన్ని పోస్టుమార్టంకు పంపామన్నారు.

పేరులో 'పురం'.. సమస్యల నిలయం

- కమలాపురం మున్సిపాలిటీ అయినా...
- ఆమడ దూరంలో అభివృద్ధి
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- కాలనీల్లో సంచరిస్తున్న పందులు

పేరుగొప్ప ఊరు దిబ్బ అంటే ఇదేనేమో.. కమలాపురం.. పేరులో పురం ఉంది. ఊరు మాత్రం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. పేరుకే ఇది మున్సిపాలిటీ.. ఇక్కడ సమస్యలకు కొదవే ఉండదు. మున్సిపాలిటీగా రూపాంతరం చెందినా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది.





రోడ్డుపై అధ్వాన్నంగా ఉన్న చెత్తకుప్ప

కమలాపురం రూరల్, మే 15: కమలాపురం మూడు సంవత్సరాల కిందట మున్సిపాలిటీగా అవతరించింది. మున్సిపాలిటీ అయిన మూడు నాలుగు నెలలకే మొట్టమొదటి ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 20 వార్డులున్నాయి. ఇందులో వైసీపీ 15, టీడీపీ 5 వార్డులు కైవసం చేసుకున్నాయి. అధికార పీఠాన్ని వైసీపీ దక్కించుకుంది. పాలకవర్గం కొలువుదీరి మూడేళ్లు అవుతున్నా.. ఇప్పటికీ ఒక్క సమస్యా పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉంది. తాగునీటికీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీటికి తోడు మారుమూల ప్రాంతాలకు పక్కా రహదారులు లేవు. వర్షాకాలంలో అయితే పలు కాలనీలు చెరువును తలపిస్తుంటాయి. ఇళ్లల్లోకి చేరి రోడ్ల మీద మురుగునీరు నెలల తరబడి నిల్వ ఉంటుంది. దీంతో దోమలు చేరి దుర్గంధం వ్యాపిస్తుంటుంది. పలువార్డుల్లో పందుల సంచారం కూడా ఎక్కువగా ఉంది. పలుమార్లు మున్సిపాలిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం అని జనం వాపోతున్నారు.


దట్టంగా పెరిగిన మొక్కలతో పూడిపోయిన మురుగునీటి కాలువ

తాగునీటికి అవస్థలు.. అస్తవ్యస్తంగా డ్రైనేజీ

కమలాపురం పట్టణంలో దాదాపు 25వేలకు పైగా జనాభా ఉంది. పట్టణంలో ప్రధానంగా మురుగునీటి సమస్య తాండవిస్తోంది. మురుగు ప్రవహించకుండా కాల్వలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోవడంతో నీరంతా రోడ్లపై పారుతోంది. దీంతో 20వ వార్డులోని ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మూడురోజులకు ఒకసారి నీళ్లు వదులుతున్నారు. కొన్ని వార్డుల్లో అసలే నీరు రాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో నీటి కష్టాలు మొదలయ్యాయి. మహిళలు వీధి కుళాయిల వద్ద బిందెలతో క్యూ కట్టాల్సిన పరిస్థితి వచ్చింది. కనీసం రోజు మార్చి రోజు అయినా నీటిని వదిలితే సమస్య ఉండదని అంటున్నారు.

మౌలిక వసతులు కరువు

కొన్ని చోట్ల వీధిదీపాలు వెలగడంలేదు. విష పురుగుల సంచారంతో దారిలో రాత్రిపూట నడవాలంటే ప్రజలు భయపడుతున్నారు. మున్సిపాలిటీగా మారినా.. కనీసం బస్సు షెల్టర్లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు ఎండకు, వానకు బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి. వీటిన్నింటికీ మించి పెద్ద సమస్య పట్టణంలో ఎక్కడా సామాజిక మరుగుదొడ్లు లేకపోవడం. బజార్లలో ఉన్నప్పుడు అత్యవసరం అయినా ఆపుకోవాల్సిందే. మరీ ముఖ్యంగా మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వీధిలైట్లు, మురుగునీటి వ్యవస్థ, సామాజిక మరుగుదొడ్లు అత్యవసరం అనేక ప్రాంతాల్లో ఇలాంటి సమస్యలు చాలా ఉన్నాయి. దారులు అధ్వాన్నంగా ఉన్నాయి. మున్సిపాలిటీ అర్హత కోసం గోపులాపురం పంచాయతీ పరధిలోని మీరాపురం గ్రామాన్ని విలీనం చేశారు. ఇంత వరకు ఆ గ్రామంలో కనీస సౌకర్యాలు కానీ, ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదు.

ఉపాధి లేక అవస్థలు

అదే విధంగా కమలాపురం మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లోని మెజార్టీ ప్రజల జీవనాధారం వ్యవసాయం. వ్యవసాయాధారిత పనులతో 60శాతం మంది ప్రజలు రోజువారి కూలీద్వారా జీవనం సాగిస్తుంటారు. వీరందరినీ ఉపాధి పనులు చాలా వరకు ఆదుకుంటాయి. ప్రస్తుతం ఉపాధి పనులు కూడా లేవని వాపోతున్నారు. తమకు ఉపాధి పనులు కల్పించాలని స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపినా అధికారులు పట్టించుకోవడం లేదు. కమలాపురం మున్సిపాలిటీని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పే ప్రజా ప్రతినిధులు ముందు కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నింటినీ పరిష్కరిస్తాం..

పట్టణంలో తాగునీటి సమస్య ఎక్కడా లేదు. ఎక్కడైనా పైపులైను సమస్యలు వచ్చినప్పుడు ఒకటి రెండు రోజులు ఇబ్బందులు ఉంటాయి. వెంటనే వాటిని పరిష్కరిస్తున్నాం. రూ.93 కోట్లతో డ్రైనేజీ, రోడ్లు తదితర వాటికి ప్రభుత్వానికి నివేదికలు పంపాం. మంజూరు అవగానే పనులు చేపడతాం. అలాగే సామాజిక మరుగుదొడ్ల కోసం మూడుప్రాంతాల్లో స్థలాన్ని కేటాయించాం. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే నిర్మాణాలు చేపడతాం. బస్ షెల్టర్ల కోసం ఆర్టీసీ శాఖకు నివేదించాం. అవి పరిశీలనలో ఉన్నాయి. త్వరలోనే వాటిని కూడా నిర్మిస్తాం.

- రాముడు, కమిషనర్, కమలాపురం మున్సిపాలిటీ


అసంపూర్తిగా ఉన్నడ్రైనేజీ కాల్వ

సివిల్ సప్లై గోడౌన్ వద్ద లారీ ఓనర్ల నిరసన

- *లోడింగ్ అన్ లోడింగ్ చార్జీలు చెల్లించాలి*
- *ఎంపీ అవినాశ్‌రెడ్డి మనుషులమని బెదిరిస్తున్నారు*
- *కాంట్రాక్టర్లు, అధికారులు మిలాఖతయ్యారు*


సివిల్ సప్లై గోడౌన్ వద్ద ఆందోళన చేస్తున్న లారీ ఓనర్లు

కడప(రూరల్) ఏప్రిల్ 15 : కడప మార్కెట్ యార్డు ఆవరణలోని సివిల్ సప్లై గోడౌన్ వద్ద బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో లారీ ఓనర్లు నిరసన వ్యక్తం చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆందోళన చేశారు. బియ్యం బస్తాలతో వెళ్తున్న కాంట్రాక్టర్ల లారీలను స్టాక్‌పాయింట్లకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో లోడింగ్‌తో ఉన్న లారీలు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, సివిల్ సప్లై లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు చంద్రారెడ్డి, చిన్నవీరయ్య, సద్దాం, ఖాజా, సుభాన్ తదితరులు మాట్లాడుతూ.. సివిల్ సప్లై బియ్యం రవాణా బాడుగలలో కాంట్రాక్టర్లు, అధికారులు మిలాఖతై బాడుగలను తక్కువగా ఇస్తూ తమ కడుపులు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రం నుంచి మండల ఎంఎల్ఎస్ పాయింట్లకు సివిల్ సప్లై (పౌరసరఫరాల) బియ్యం రవాణా కాంట్రాక్ట్‌ను తాత్కాలికంగా పొందిన కాంట్రాక్టర్లు నిబంధనలను తుంగలో తొక్కి లారీ ఓనర్లకు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. తాత్కాలికంగా వచ్చిన కాంట్రాకర్లు ఎంపీ అవినాశ్‌రెడ్డి మర్గీయులమని బాడుగలను తాము ఇచ్చినంత తీసుకొని వెళ్లాలని బెదిరిస్తున్నారన్నారు. ఈమేరకు సివిల్ సప్లై బియ్యాన్ని మండల కేంద్రాలకు రవాణాచేసే లారీలకు లోడిండ్ అన్‌లోడింగ్ విషయాలలో హమాలీ, టోల్గేట్ చార్జీలు చెల్లించకుండా ఒక్కొక్క లారీకి సుమారు రూ.1300లు తగ్గించి ఇస్తున్నారని అన్నారు. రవాణా చార్జీలు సైతం టన్నుకు పోరుమామిళ్లకు రూ.470లకు గాను రూ.420లు, మైదుకూరుకు రూ.320లకు గాను రూ.280లను, ప్రొద్దుటూరుకు రూ.350 గాను రూ.330లు, ఒంటిమిట్టకు రూ.310లకు గాను రూ.250 చెల్లిస్తున్నారన్నారు. తాము అవినాశ్‌రెడ్డి మనుషులమని, అధికారులకు సైతం మామూళ్లు ఇస్తున్నామని ఎవరికి చెప్పుకున్నా ఏమీ చేయలేరని అంటున్నారని వాపోయారు. ఈ మేరకు సివిల్ సప్లై డీఎంకు పలుమార్లు తమ సమస్యను విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో నిరసన చేపట్టాల్సి వచ్చిందన్నారు.

కాటన్ దొర జల, జనహితుడు

- *కాటన్ దొరకు నివాళులర్పించిన తులసిరెడ్డి*


కాటన్ దొరకు నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

వేంపల్లె, మే 15: స్వర్గీయ సర్ ఆర్థర్ కాటన్ దొర జలహితుడు, జనహితుడు, అపర భగీరథుడు, నదుల అనుసంధానానికి ఆద్యుడని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి కీర్తించారు. బుధవారం వేంపల్లెలో కాటన్ దొర 221 జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. తులసిరెడ్డి మాట్లాడుతూ కాటన్ దొర అంగ్లేయుడైనప్పటికీ సమాజ సేవ పరమావధిగా భావించి భారతీయుల, ప్రత్యేకించి ఆంధ్రుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. 1847-1852 మధ్యకాలంలో గోదావరి నదిపై ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించి క్షామపీడిత ప్రాంతమైన గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేశారన్నారు. కృష్ణానదిపై విజయవాడ వద్ద ఆనకట్ట నిర్మాణం, కావేరి నదిపై ఆనకట్ట నిర్మాణం కాటన్ కృషి వల్లనే అన్నారు. 1863-1870 మధ్యకాలంలో కర్నూలు-కడప కాల్వను (కేసీ కెనాల్) నిర్మించి కర్నూలు, కడప జిల్లాలో కొంత ప్రాంతానికి సాగునీరు, తాగునీరు అందించడమే కాక తుంగభద్ర-పెన్నా నదుల అనుసంధానంతో నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టారన్నారు. కాటన్ మహాశయుడి స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వాలు సాగునీటిరంగానికి ఎంతో ప్రాముఖ్యతనిచ్చాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ టి.సుబ్రమణ్యం, రామకృష్ణ, ఉత్తన్న పాల్గొన్నారు.

టీడీపీ ఏజెంట్లపై దాడి కేసులో 8 మంది అరెస్టు

మైదుకూరు/చాపాడు, మే 15: చాపాడు మండలం చిన్నగులువలూరు పోలింగ్ కేంద్రంలోని టీడీపీ ఏజెంట్లపై దాడి చేసిన కేసులో 8 మందిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ టి.వెంకటేశులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా చిన్నగులువలూరు 168 పోలింగ్ కేంద్రంలో ఏజెంట్లుగా కూర్చున్న కుచ్చుపాప ఉగ్రనరసింహుడు, కుచ్చుపాప వినోద్‌కుమార్‌లను ఉదయం 7.40 గంటల ప్రాంతంలో కొందరు పోలింగ్ కేంద్రం నుంచి బయటకు లాగి, కొట్టి, కులం పేరుతో తిట్టి హత్యాయత్నం చేశారు. ఈ మేరకు వినోద్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో చాపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి చాపాడు మండలం చిన్నగులువలూరుకు చెందిన పాలగిరి లక్ష్మీనారాయణరెడ్డి, పాలగిరి వెంకట సుబ్బారెడ్డి, పాలగిరి గోవర్ధనరెడ్డి, గంజికుంట హర్షవర్ధన్‌రెడ్డి, కొండయ్యగారి శంకర్‌రెడ్డి, కారుముళ్ల భాస్కర్‌రెడ్డి, పాలగిరి చంద్రమోహన్‌రెడ్డి, యర్రన్నగారి చంద్ర ఉరఫ్ చంగా చంద్ర ఓబుళరెడ్డిలను బుధవారం అరెస్టు చేశామని డీఎస్పీ తెలిపారు. వీరిని మైదుకూరులోని కోర్టుకు హాజరుపెట్టగా కోర్టు రిమాండ్‌కు ఆదేశించడంతో జైలుకు తరలించామన్నారు.

మరో వివాహం చేసుకోవాలనే కొడుకు హత్య..

వేంపల్లె, మే 15: మరో అమ్మాయిని పెళ్లి చేసుకోవాలనే దురుద్దేశంతో భార్య సంధ్యను వేధించడంతో పాటు ఒకటిన్నర సంవత్సరం వయసు ఉన్న కొడుకు శ్రీనివాస్‌ను తండ్రి హత్య చేశాడని సీఐ చాంద్‌బాషా తెలిపారు. ఈనెల 11న సురేష్ అనే వ్యక్తి తన కొడుకు శ్రీనివాస్‌ను గొంతునులిమి చంపిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడిని బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారని ఆయన తెలిపారు. పిల్లాడికి ఏడాది వయసు ఉన్నప్పుడు కూడా చంపేందుకు ప్రయత్నించాడని, ఆసుపత్రిలో చికిత్స పొందారని తెలిపారు. మనసులో దురుద్దేశంతో పెట్టుకుని ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారని తెలిపారు.

ఏఎస్ఐ అన్వర్ మృతి



గోపవరం, మే 15: ఐదేళ్లుగా బద్వేలు రూరల్ పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న ఆర్.అన్వర్ అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు స్వగృహంలో మరణించారు. బద్వేలు రూరల్ సీఐ విక్రమ సింగ్, ఎస్ఐ రవికుమార్, జిల్లా పోలీసు అధికారుల అసోసియేషన్ అధ్యక్షుడు దూలం సురేష్, కార్యదర్శి ఉప్పుశంకర్, సిబ్బంది మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. కడప నుంచి వచ్చిన రిజర్వు పోలీసులు గౌరవ వందనం, ఇతర పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

టూరిజం అండ్ ట్రావెల్ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప (మారుతీనగర్) మే 15. కేంద్ర ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వశాఖ సార థ్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి నెల్లూరులో గల ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ మేనేజ్మెంట్ (ఐటీటీఎం)లో టూరిజం అండ్ ట్రావెల్ కోర్సుల కొరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐఐటీటీఎం సహాయ ఆచార్యులు పి.శరవణన్ కోరారు. బుధవారం కడప ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసక్తిగల ఏదేని డిగ్రీ పాసైన విద్యార్థులు 2 సంవత్సరాల కోర్సు అయిన ఎంబీఏ (టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్మెంట్) కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఇంటర్మీడియట్ పాసైన వారు 3 సంవత్సరాల బీబీఏ (టూరిజం అండ్ ట్రావెల్) కోర్సుకు దరఖాస్తు చేసుకోవా లన్నారు. ఇతర వివరాలకు 9966462786 అనే నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

కన్నుల పండువగా జ్యోతి ఉత్సవం



జ్యోతులను ఊరేగిస్తున్న దృశ్యం, (ఇన్‌సెట్లో) ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చిన్నమండెం, మే 15: మండలంలోని దేవగుడిపల్లె గ్రామ పంచాయతీలో కొండమూల గ్రామంలో వెలిసిన శ్రీచౌడేశ్వరిదేవి ఉత్సవాలను మంగళవారం రాత్రి తొగటవీర క్షత్రియ సంఘం వారిచే కన్నుల పండువగా సాగాయి. శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారిని, జ్యోతులను సింహవాహనంలో మంగళ వాయిద్యాల నడుమ శోభాయమానంగా విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా ప్రకాశిస్తూ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో పెద్ద సంఖ్యలో బాణాసంచాలు కాలుస్తూ, బళ్లారి డ్రమ్స్, వివిధ రకాల వేషధారణలు, చెక్కభజనలు, కోలాటం, యువకుల కేరింత నడుమ అత్యంత కన్నుల పండువగా రాత్రంతా ఈ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అగ్నిగుండాల కార్యక్రమానికి భక్తాదులు తరలివచ్చారు. మొక్కులు సమర్పించుకొని బోనాల కార్యక్రమం నిర్వహించిన అనంతరం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి పెద్దఎత్తున తొగటవీర క్షత్రియ సంఘం కుటుంబ సభ్యులు బెంగుళూరు, ఎల్లకం, హైదరాబాదు వంటి వివిధ ప్రాంతాల నుంచి తొగటవీర క్షత్రియ సంఘం ప్రముఖులు హాజరయ్యారు.

టీడీపీ అధికారంలోకి రావడం తథ్యం

- మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి



విలేకర్లతో మాట్లాడుతున్న ద్వారకనాథరెడ్డి

రామాపురం, మే 15: ఈ నెల 12న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆయన స్వగృహంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎంగా చంద్రబాబు, రాయచోటి ఎమ్మెల్యేగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలు ఘనవిజయం సాధిస్తారన్నారు. రాష్ట్రంలో టీడీపీకి 140 సీట్లు వస్తాయని జోష్యం చెప్పారు. గత ఐదు సంవత్సరాలుగా వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, అవినీతి, భూ ఆక్రమణలు ప్రజల్లో ఇమిడిపోయాయన్నారు. చంద్రబాబును సీఎం చేయాలనే ఉద్దేశ్యంతో ప్రజలు, యువకులు, మహిళలు ఎండ సైతం లెక్కచేయకుండా పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లి టీడీపీకి ఓటు వేశారన్నారు. ఈ కార్యక్రమంలో అంజనేయులు, రాజా, శివారెడ్డి, గంగిరెడ్డి, ధర్మయ్య, సుబ్బరామయ్య, కదిరప్పనాయుడు పాల్గొన్నారు.

120 స్థానాలతో కూటమి విజయం

- రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి



విలేకర్లతో మాట్లాడుతున్న మేడా విజయశేఖర్‌రెడ్డి

రాజంపేటటౌన్, మే 15: రాష్ట్రంలో జగన్ మోహన్‌రెడ్డి అరాచక పాలనకు ఓటు అనే ఆయుధంతో ఈ నెల 13న ప్రజలు అంత మొందించారని, రాష్ట్ర వ్యాప్తంగా తమ అంచనా మేరకు ఎన్‌డీఏ కూటమి 120 స్థానాలకు పైబడి కైవసం చేసుకుంటుందని, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం రాజంపేటలో తన కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రౌడీరాజ్యం జూన్ 4వ తేదీన అంతం కాబోతుందన్నారు. ఎన్నికల రోజున వైసీపీ నాయకులు చేసిన దౌర్జన్యాలు అన్నీ ఇన్నీ కావని, రాష్ట్రంలో భారీ ఎత్తున పోలింగ్ శాతం పెరిగిందంటే యువత జగన్‌ను ఇంటికి పంపడానికి ఈవీఎం కేంద్రాలకు వచ్చి ఓటు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాముయాదవ్, శ్రీధర్‌వర్మ, ముద్దా ఆదిశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s. Shriram Finance Ltd., Rly. Kodur Branch, Rly. Kodur Post & Mandal,Annamaiah Dist. A.P.I hereby given the pub lic;notice that: **Moode Asha W/o Moode Krishna Naik,** Aged 54 years, Hindu house Wife, Door No: 25/23, Vavilla Voddu Bidiki, Rayavaram Village & Post,Sundupalle Mandal, Annamaiah Dist, A.P. applied for a loan from my clients Finance Ltd., by mortgaging the schedule mentioned property which Stands in her name. If anybody has got any objections with regard to the schedule men tioned property, file their objection. before my clie nt's Office or in my Office within 10 days of this pub lication, failing which, loan will be sanctioned and issued to the applicant.

SCHEDULE: The property is situated at Annamaiah Dist. Sundupalle Sub-Dist. Sundupalle Mandal, Sundupalk Clrama Panchayath, Sundupalle Gramam H/o Eguva Edigappalle, 3rd.Ward, Residential Area, Sundupalle Venkata Krishna Rao Nagar, in Survey No: 2072 an extent of 136.11 Chadarapu Gajamulu or 113.78 Meters out of an extent of Ac.0.92 cents out of an extent of Ac. 1.84 cents situated near to the house bearing Door No: 23/48.

Boundaries : **East:** 20 Feet width Rastha, **West** : Vacant site of Marripati Krishnaiah etc., **North:** Site Gundlapalle Ramesh Achari, **South** : Vacant site of Marripati Krishnaiah etc.,

Site Measurements: **East to West** : 35 Feet (10.6680 Mts), **North to South:** 35 Feet (10.6680 Mts) Total an extent of 136.11 Chadarapu Gajamulu or 113.78 Meters of vacant Site.

S. KRISHNA KUMAR, M.A., B.L.
S. GIREESH KUMAR, M.Tech. LLM
Advocates, Rajampet

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

ఒంటిమిట్ట, మే 15: మండలంలోని రైతు భరోసా కేంద్రాలకు పచ్చిరొట్ట విత్తనాలను వ్యవసాయ అధికారులు పంపిణీ చేశారు. పచ్చిరొట్ట విత్తనాలు జీలుగలు 100 క్వింటాలు, జనములు 24 క్వింటాలు మండలానికి వచ్చాయని, కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో 16వ తేది నుంచి 21వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకొని డబ్బులు చెల్లించాలని వ్యవసాయ అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. డబ్బులు చెల్లించిన వారికి 23వ తేది నుంచి విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జీలుగలు ధర కేజీ రూ.88 కాగా 50 శాతం సబ్సిడీతో కేజీకి రూ.44 చెల్లించి విత్తనాలు పొందవచ్చని వ్యవసాయ అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

గుంతలరోడ్లలో వెళ్లేదెలా..?

- ఓటేశాక వంచన
- ఐదేళ్లుగా మాటలతోనే కాలయాపన
- ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రజలు

సుండుపల్లె, మే 15: వైసీపీ పాలనలో మౌలిక వసతులు కల్పించే ప్రక్రియలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. సంక్షేమ పథకాలు తప్ప ఎటువంటి అభివృద్ధి కానరాలేదని, అసలు ఐదేళ్లుగా మండలంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేకపోయారని అంటున్నారు. ఓటు వేయించుకున్న పాపానికి దళితవాడలకు సైతం మెరుగైన రవాణా సౌకర్యం కల్పించలేని దౌర్భాగ్య పరిస్థితి ప్రభుత్వంలో ఏర్పడిందని దళిత గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే...

మండల కేంద్రానికి సమీపంలో చెన్నంశెట్టిపల్లె సమీప రోడ్డు నుంచి సాకలపల్లి, కుమ్మరపల్లె, కొత్త వడ్డెపల్లె, రవీంద్రనాథ్‌రెడ్డి కాలనీ, ఎగువ మాలపల్లి, పోచంపల్లి, పోచంవాండ్లపల్లె, చీకటిపల్లి, ఎల్లారెడ్డిగారిపల్లెలకు వెళ్లే రహదారి దశాబ్దాల కాలం నుంచి గుంతలమయంగానే ఉంది. రాకపోకలు నిర్వహించే రహదారులు గోతులమయంగా మరాయి. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నూతన రహదారి నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయమని పలుమార్లు వైసీపీ నేతలకు విన్నవించినా, సమస్య పరిష్కరిస్తామని మాటలతోనే కాలయాపన చేశారని మహిళలు వాపోతున్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసమేనా తాముండేది.. ఇక అభివృద్ధి చేయరా అని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ పల్లెల నుంచి మండల కేంద్రానికి రావాలంటే సుమారు ఐదారు కిలోమీటర్లు నడకదారిన వెళ్లాలి. వర్షం పడితే రోడ్లు గుంతలమయం, రోడ్లలో వర్షపు నీరు నిలువ ఉండడం వలన ద్విచక్ర వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు వాపోతున్నారు.



తారు రోడ్డుకు నోచుకోని 8 పల్లెలకు వెళ్లే రహదారి

మాటిచ్చి.. మడమ తిప్పారు

2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో వైసీపీ అభ్యర్థులు మేమున్నాము... జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కాగానే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఒకసారి ఓటు వేయమని వైసీపీ నాయకులు ప్రాధేయపడితే ఓటు వేశాం. ఓటు వేయించుకున్న తర్వాత ఒక్కసారి కూడా తమ పల్లెల మొహం చూడలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తారు రోడ్డు వేసి బస్సు సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తామని మాటిచ్చి మడమ తిప్పారని, అలాంటి వారికి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని గ్రామస్తులు చెబుతున్నారు. మంచి జరుగుతుందన్న ఆశతో వైసీపీకి అఖండ మెజార్టీని అందిస్తే.. ఏనాడైనా పల్లెలకు వచ్చి ప్రజల సమస్యలను అడిగారా... అని ఆగ్రహం చెందారు.

రోడ్డు ప్రారంభించి.. ఆపేశారు



- సంతోషమ్మ, పోచంవాండ్లపల్లె

మూడు సంవత్సరాల క్రితం రోడ్డు పనులు పూర్తి చేస్తామని.. నిధులు వచ్చాయని రోడ్డును ప్రారంభించారు. బడి వెనుక భాగం నుంచి రోడ్డును తవ్వేశారు. కంకర తోలి రోడ్డు వేస్తున్నామని పనులు ప్రారంభించి అర్థాంతరంగా ఆపేశారు. కంకర వేసి రోడ్డు ఆపేయడం వలన నడిచేందుకు వీలు లేకుండా ఉంది. సుమారు ఏడాది కాలం తీవ్ర ఇబ్బందులు పడ్డాము. ఆ తర్వాత మట్టి తోలి చదును చేశారు. కానీ తారురోడ్డు మాత్రం వేయలేదు. కావాలనే ఆపేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆటోలు కూడా పల్లెలకు రావడం లేదు



- నారాయణ, హరిజనవాడ

మా ఊరి నుంచి సుండుపల్లెకు పోవాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. రోడ్డు వేయమని ఎంత మంది నాయకులకు చెప్పినా లాభం లేదు. వినతి పత్రాలు కూడా అధికారులకు ఇచ్చాం. చేస్తామం టారు.. కానీ ఎవరూ చేయడం లేదు. రోడ్డు బాగాలేకపోవడంతో ఆటోలు కూడా పల్లెలకు రావడం లేదు. రోడ్డు వేసి పుణ్యం కట్టుకోండి.

సమస్యలు పరిష్కరించడం మరిచారు



- నాగార్జున, సాకలపల్లి

వైసీపీ పాలనలో ప్రజా సమస్యల పరిష్కరించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారు. ఐదేళ్లుగా ఎటువంటి అభివృద్ధి జరగలేదు. కనీసం తారురోడ్డు కూడా వేయలేని దౌర్భాగ్య పరిస్థితి. ఎన్నికల సమయంలో రోడ్డు వేస్తామని హామీ ఇచ్చారు. రోడ్డు వసతి సరిగ్గా లేకపోవడంతో మండల కేంద్రం నుంచి పల్లెకు రోజు నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పెరిగిన ఓటింగ్ ఎవరికి మేలు ?

- అంచనాల్లో తలమునకలైన టీడీపీ, వైసీపీ శ్రేణులు
- ఓటింగ్ సరళిపై సర్వత్రా ఆసక్తి

గాలివీడు, మే 15: సోమవారం జరిగిన సాధారణ ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల విషయంలో పెరిగిన ఓటింగ్ శాతం ఎవరి కొంప ముంచుతుందో, ఎవరికి మేలు చేకూరుతుందోనని టీడీపీ, వైసీపీ శ్రేణులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లోని 44 బూత్‌లలో 41,541 మంది ఓటర్లు కలరు. ఇందులో 30 వేల మందికి పైగా ఓటుహక్కు వినియోగించుకొన్నారు. గతంలో అయితే 2019లో జరిగిన సాధారణ ఎన్నికల్లో 76 శాతం పోలుకాగా ఈ సారి 80 శాతం ఓట్లు పోలయ్యాయి. అంటే ఈ సారి ఓటింగ్ శాతం బాగా పెరిగింది. పెరిగిన ఓటింగ్ శాతంపై టీడీపీ, వైసీపీ శ్రేణులు ఎవరికి అనుకూలంగా ప్రజలు ఓటింగ్ వేశారోనని అంచనాల్లో తలమునకలై ఉన్నారు. సోమవారం జరిగిన సాధారణ ఎన్నికల్లో ఓటు వేయడానికి అన్ని వర్గాల ప్రజలు అత్యంత ఆసక్తి చూపారు. వేరే రాష్ట్రాల్లో పనిచేస్తున్న యువత సొంత ఖర్చులు పెట్టుకుని ఓటింగ్‌లో పాల్గొన్నారు. టీడీపీకి గ్రామీణ ప్రాంతాల్లోని యువత, నిరుద్యోగులు, ఉద్యోగస్తులు, మహిళలు, రైతులు అనుకూలంగా ఓట్లు వేసినట్లు సమాచారం. సాధారణ ఎన్నికల్లో గతంలో కంటే ఓటింగ్ శాతం పెరిగిందంటే ప్రస్తుతం ఉన్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసినట్లు పలువురు అభిప్రాయ పడుతున్నారు. మండలంలో ముఖ్యంగా గాలివీడు, అరవీడు, గోరాన్‌చెరువు, గొట్టివీడు, తూముకుంట, గుండ్లచెరువు, కొర్లకుంట పంచాయతీల్లో టీడీపీకి అనుకూలంగా మెజార్టీ వస్తుందని అంచనాలు వేసుకొంటున్నారు. 2019లో జరిగిన సాధారణ ఎన్నికల్లో మండలం నుంచి వైసీపీకి 5900 ఓట్లు మెజార్టీ రాగా, ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో ఎక్కువ గ్రామాల్లో టీడీపీకి అనుకూలంగా మెజార్టీ వస్తుందని అంచనా. పోలింగ్ ముగిసిన నాటి నుంచి నేటి వరకు గ్రామాల్లోకి టీడీపీ, వైసీపీ నాయకులు ఏ పల్లెలో ఎవరికి అనుకూలంగా ఓట్లు వేశారో అని స్థానిక నాయకులను అడిగి తెలుసుకొంటున్నారు. పోలింగ్ కేంద్రంలో మొదట ఓటు ఎంపీ అభ్యర్థికి, రెండవ ఓటు ఎమ్మెల్యే అభ్యర్థికి వేసేలా పోలింగ్ అధికారులు భూతులను ఏర్పాటు చేశారు. వృద్ధులు, తెలియని కొంతమంది వ్యక్తులు మొదట భూతుల్లోకి వెళ్లినప్పుడు సైకిల్ గుర్తుకోసం చాలాసేపు వెతికినట్లు సమాచారం. ఈ సారి పెరిగిన ఓటింగ్ శాతం వల్ల టీడీపీకి వెయ్యి నుంచి రెండు వేల మెజార్టీ వస్తుందని అంచనా. ఏదేమైనా ఏ పార్టీకి ఎంత మెజార్టీ వస్తుందనేది జూన్ 4వ తేది వరకు వేచి ఉండాల్సిందే.



ఓటు వేయడానికి క్యూలో ఉన్న ఓటర్లు (ఫైల్)

క్షయవ్యాధి నివారణకు టీకాలు వేయించుకోండి



మాట్లాడుతున్న దేవపట్ల వైద్యాధికారి సునీల్‌కుమార్

సంబేపల్లె, మే 15: క్షయవ్యాధి నివారణ కొరకు ప్రతిఒక్కరూ అడల్ట్ బీసీజీ టీకా తప్పనిసరిగా వేయించుకోవాలని డీఎం అండ్‌హెచ్‌వో కొండయ్య, లెప్రసీ జాయింట్ డైరెక్టర్ దేవసాగర్ తెలిపారు. బుధవారం సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వారు ఆకస్మిక తనిఖీ చేశారు. క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యంగా టీకాలను ప్రజలకు అందించాలని తెలియజేశారు. దేవపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సునీల్‌కుమార్ నాయక్ బనేటి నుంచి ఈ వ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలియజేశారు. ప్రతి గురువారం ఈ వ్యాక్సిన్ అందిస్తామని, 16 వారాల పాటు వ్యాక్సిన్ వేసే కార్యక్రమం చేపడతామన్నారు. భవిష్యత్తులో క్షయవ్యాధి నివారిస్తామన్నారు. ఆరోగ్య కేంద్ర పరిధిలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలను అందించాలని జిల్లా వైద్యాధికారి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సూర్యనారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



ఆశ్రమానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

చిట్వేలి, మే 15: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చిట్వేలి శాఖ ఆధ్వర్యంలో ఎం.రాచపల్లెకు చెందిన చక్రవర్తుల భరణి జన్మదినం సందర్భంగా కుటుంబ సభ్యులు చిట్వేలి-రాపూరు మార్గ మధ్యలో వెలసిన శ్రీ దత్తగిరి నారాయణ తపోవన ఆశ్రమానికి నిత్యావసర సరుకులు వితరణగా అందించారు. దాతలకు ఆశ్రమ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పటమరాజు, శంకరమ్మ, చక్రవర్తులు నాగమ్మ, సుబ్బరాయుడు రాజు, భార్గవి, లక్ష్మీ, నాగేంద్ర రాజు, లలిత వర్మ, చాణిక్య, చిన్ను, నందు, నాని, శివ, పవన్‌రాజు, సందీప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రారంభమైన జాతర ఉత్సవాలు



విజయవాడ తప్పెట్లు, అమ్మవారి ప్రతిమ మాదిరిగా విద్యుత్ దీపాలంకరణ

రైల్వేకోడూరు, మే 15: పట్టణంలో గంగమ్మ తల్లి జాతర ఉత్సవాలు బుధవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. బలిజ వీధిలోని గంగమిట్ట వద్ద వేప మండలతో గుడిని ఏర్పాటు చేశారు. అంకాలమ్మ గుడి వద్ద నుంచి గంగమిట్ట వరకు అమ్మవారి వేషాలు భక్తులను ఆకట్టుకున్నాయి. విజయవాడ తప్పెట్లు దద్దరిల్లాయి. బ్యాండు మేళాలతో ఊరేగింపులు చేశారు. గంగమ్మ జాతర సందర్భంగా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దొంగతనాలు జరగకుండా ముందస్తు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. అర్ధరాత్రి గంగమ్మ తల్లి ప్రతిమను ఊరేగించే పల్లకిలో అంకాలమ్మ దేవస్థానం వద్ద తయారు చేసి పురవీధుల్లో ఊరేగిస్తారు. గురువారం తెల్లవారుజామున భక్తులు గంగమ్మ తల్లికి మొక్కులు తీర్చుకుంటారు. తరువాత దర్శనం ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే రైల్వేకోడూరు జాతర సందర్భంగా ఇతర ప్రాంతాల ప్రజలు చేరుకున్నారు. మొక్కుబడుల్లో ఉన్న భక్తులు మజ్జిగ, భోజనాలు తదితరాలను ఏర్పాటు చేశారు.



అమ్మవారిని నిలిపే మండపం

18న మండల సర్వసభ్య సమావేశం

సిద్దవటం, మే 15: మండలంలోని ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 18వ తేదీ శనివారం ఉదయం 10గంటలకు మండలాధ్యక్షురాలు అధ్యక్షతన మండల ప్రజాపరిషత్ సభాభవనంలో నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి ఉమామహేశ్వరరావు తెలియజేశారు. అజెండా అంశాలు ఉపాధి హామీ పథకంపై సమీక్ష, తాగునీరు పారిశుధ్యం తదితర అంశాలపై సమావేశం ఉంటుందని, ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని తెలిపారు. మండల సమావేశం చట్టరీత్యా నిర్వహించాల్సి ఉన్నందున ఎన్నికల నియమావళి ప్రకారం ఎటువంటి తీర్మానాలు ఆమోదించబడవన్నారు.

సుభాష్‌రెడ్డిని పరామర్శించిన జనసేన నేత



సుభాష్‌రెడ్డిని పరామర్శిస్తున్న రామాశ్రీనివాస్

పుల్లంపేట, మే 15: మండల పరిధిలోని పాపక్కగారిపల్లెలో ఎన్నికల రోజు జనసేన ఏజెంట్‌ను తీసుకెళ్తున్న టీడీపీ నాయకుడు ముద్దా సుభాష్‌రెడ్డిపై వైసీపీ నాయకులు దాడి చేశారు. ఈ కారణంగా గాయపడిన సుభాష్‌రెడ్డిని బుధవారం రైల్వేకోడూరు జనసేన నాయకుడు రామా శ్రీనివాస్ పరామర్శించారు. నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ అత్యధిక మెజార్టీతో గెలుపొందుతాడని, వైసీపీ నాయకుల ఆగడాలు అంతమవుతాయని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా జనసేన కార్యకర్తలకు, కూటమి నాయకులకు అండగా ఉంటామన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

మదనపల్లె అర్బన్, మే 15: ఈ నెల 3న జరిగిన సాంబశివ (39)అనే వ్యక్తిపై కత్తితో దాడి చేసిన కేసులో నిందితుడు సయ్యద్ హుసేన్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు కొద్దిరోజుల క్రితం నీరుగుట్టవారిపల్లెకు చెందిన సాంబశివ, బండిలే గిరి గొడవ పడ్డారు. ఈ విషయ మై బడిలే గిరి బావమరిది సయ్యద్ హుసేన్ సాంబశివపై కత్తితో దాడి చేసి తలపై, డొక్కలో పొడిచి గాయపర్చాడు. ప్రస్తుతం సాంబశివ బెంగళూరులో చికిత్స పొందుతున్నాడు. బుధవారం చౌడేశ్వరి నగర్‌లో ఉన్న నిందితుడు సయ్యద్ హుసేన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ వివరించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లెటౌన్, మే 15: కుటుంబ సమస్యలతో ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. మండలంలోని గంగాపురంపల్లెకు చెందిన వేణు కుమారుడు మధుసూదన్ (21) బుధవారం ఇంట్లోనే పురుగుమందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబీకులు అతడిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించడంతో తేరుకున్నాడు. కాగా కుటుంబ సమస్యలే ఇందుకు కారణమని సమాచారం.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, మే 15: పట్టణంలో బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. మైకావీధికి చెందిన బాలిక (19) మంగళవారం చెత్తపడేయడానికి ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదని ఆమె తండ్రి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసుపై దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు టూటౌన్ ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

తాగునీటి సమస్యపై అధికారులు దృష్టి సారించాలి : పీడీఎస్‌యూ

లక్కిరెడ్డిపల్లె, మే 15: మండలంలో తాగునీటి సమస్య గత 6 నెలల నుంచి తీవ్రంగా ఉందని, సమస్యపై అధికారులు దృష్టి సారించి పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న పేర్కొన్నారు. మండలంలో పాళెంగొల్లపల్లె, బర్జుపల్లె, దప్పేపల్లె, చిన్ననాగిరెడ్డిపల్లె, కుర్నూతల, మామిడిగారిపల్లె, బి.ఎర్రగుడి, చంచర్లపల్లె, కాకుళవరం, హరిజనవాడ, దిన్నెపాడు డి.వడ్డెపల్లె, కోనంపేట, అనంతపురం హరిజనవాడ, ఈడిగపల్లె గ్రామాల్లో 6 నెలల నుంచి తాగునీటితో ఇబ్బందులు పడుతున్నారని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అన్ని వర్గాలవారికి ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు చంద్రశేఖర్, ప్రసాదు, ఈశ్వరయ్య, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

ఎక్కడో అమరావతి, ఢిల్లీల్లో కూర్చున్న ఎన్నికల కమిషన్ అధికారులకున్న ముందు చూపు కూడా స్థానికంగా వున్న అధికారులకు లేకపోయిందన్న అపవాదును జిల్లా యంత్రాంగం, పోలీసు యంత్రాంగం ఎదుర్కొంటున్నాయి. దాన్ని నిజం చేస్తూ పోలింగ్ రోజు, తర్వాత రోజు ఘటనలను అంచనా వేయడంలోనూ, ముందస్తు చర్యలు తీసుకోవడంలోనూ ప్రత్యేకించి పోలీసు యంత్రాంగం విఫలమైనట్టు స్పష్టంగా కనిపిస్తోంది. చంద్రగిరి నియోజకవర్గంలో సంభవించిన రాజకీయ హింసాత్మక ఘటనల వెనుక ప్రధానంగా పోలీసు యంత్రాంగం వైఫల్యమే కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



ఈవీఎంల స్ట్రాంగ్ రూము ఏర్పాటు చేసిన మహిళా వర్సిటీ వద్ద మంగళవారం సాయంత్రం గంటలకొద్దీ కొనసాగిన ఉద్రిక్త వాతావరణం

సున్నిత ప్రాంతాలపై కొరవడిన నిఘా

పోలీసు వైఫల్యంతోనే హింసాత్మక ఘటనలు!

ముందస్తు అంచనాలు, జాగ్రత్తల్లో నిర్లక్ష్యం

ఘర్షణలు జరిగాకైనా మేలుకోని వైనం

ఈసీకి వున్న ముందుచూపు జిల్లా యంత్రాంగానికేదీ?

తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో పరిస్థితులు సజావుగా లేవని ఎన్నికల కమిషన్ ఎప్పుడో గ్రహించింది. దానికి తగ్గట్టుగా అనేక చర్యలు తీసుకుంది. అందులో భాగమే వంద శాతం వెబ్ కాస్టింగ్. అలాగే కేంద్ర బలగాల మొహరింపు. వాస్తవానికి జిల్లా యంత్రాంగం చంద్రగిరిలోని 397 పోలింగ్ కేంద్రాల్లో 202 సమస్యాత్మకమని, 15 తీవ్ర సమస్యాత్మకమని ప్రతిపాదించాయి. అలాగే తిరుపతిలో 274 పోలింగ్ కేంద్రాలకు గానూ 86 సమస్యాత్మకమని ప్రతిపాదించాయి. శాంతిభద్రతల పర్యవేక్షణకు వచ్చిన కేంద్ర పరిశీలకుడు ఈ రెండు నియోజకవర్గాలపై వచ్చిన ఫిర్యాదులను, ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని వంద శాతం వెబ్ కాస్టింగ్‌తో పాటు కేంద్ర బలగాల నియామకానికి సిఫారసు చేశారు. ఈసీ సైతం దాన్ని ఆమోదించింది. ఈ నిర్ణయం వెనుకున్న స్ఫూర్తిని జిల్లా యంత్రాంగం యథాతథంగా స్వీకరించలేదన్న ఆరోపణలున్నాయి.

బ్రాహ్మణ కాలవ ఘటనే ఉదాహరణ

రామచంద్రాపురం మండలం బ్రాహ్మణ కాలవ టీడీపీకి పట్టున్న గ్రామం. ప్రత్యర్థి పార్టీ ఏజెంట్లు బయటి నుంచీ రావాల్సిందే. ఎక్కడైనా ఒక పార్టీకి గట్టి బలమున్న చోట ప్రత్యర్థి పార్టీల ఏజెంట్లకు రక్షణ వుండదు. అలాంటి చోట్ల పోలీసులు కఠినంగా వ్యవహరిస్తేనే బలహీనంగా వున్న వర్గంపై బలమైన వర్గం ఆధిపత్యం చెలాయించకుండా వుంటుంది. అక్కడ వైసీపీ ఏజెంట్లపై దౌర్జన్యం జరిగిందని ప్రచారం జరగడంతో వైసీపీ అభ్యర్థి భారీగా అనుచరులను వెంటబెట్టుకుని గ్రామానికి వెళ్లడం, దాంతో గ్రామస్థులు ఆగ్రహంతో రెచ్చిపోవడం జరిగాయి. ఈ ఉద్రిక్తతలే గాల్లోకి కాల్పులు జరపడానికి దారి తీశాయి. ఇక్కడ గత ఎన్నికల్లో కూడా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై దాడి జరిగినంత పనైంది. ఇలాంటి చరిత్ర వున్న పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు తగిన విధంగా వ్యవహరించలేదన్న ఆరోపణలున్నాయి.

రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లి ఘటనలతోనూ మేలుకోని వైనం

చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లి గ్రామాల్లో పోలింగ్ రోజు రాత్రి దాడులు, ప్రతిదాడులతో భయానక వాతావరణం నెలకొంది. వైసీపీ వర్గీయుల దాడిలో పదిమంది గాయపడగా, ప్రతిదాడిలో వైసీపీ సర్పంచ్ ఇల్లు, రెండు వాహనాలు తగులబడ్డాయి. బ్రాహ్మణకాలవతో పాటు ఈ రెండు గ్రామాలకు కూడా వైసీపీ అభ్యర్థి మోహిత్‌రెడ్డి స్వయంగా వెళ్లారు. అధికార పార్టీ అభ్యర్థి మందీ మార్బలంతో వెళ్లడం వల్లే మూడుచోట్లా ఉద్రిక్తతలు పెరిగాయన్న ఆరోపణలున్నాయి. కనీసం అప్పుడైనా పోలీసు యంత్రాంగం మేలుకొని పరిస్థితులు అదుపులోకి వచ్చేదాకా వైసీపీ అభ్యర్థిని గృహ నిర్బంధంలో వుంచాల్సింది. అది కూడా చేయలేదు. వైసీపీ దాడులకు టీడీపీ నుంచీ ప్రతిదాడులుంటాయన్న ప్రాథమిక అంచనా కూడా పోలీసు యంత్రాంగానికి లేకపోవడం గమనార్హం. ఇరు పార్టీల అభ్యర్థులకూ షాడో పార్టీలు వేయాలన్న ఆలోచన కూడా చేయలేదు.

పోలీసు వైఫల్యానికి నిదర్శనం

మహిళా వర్సిటీ ఆవరణలో టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై వైసీపీ వర్గీయులు జరిపిన దాడి పోలీసు వైఫల్యానికి పరాకాష్టగా చెప్పాలి. మహిళా వర్సిటీలో విద్యార్థినులు, వర్సిటీ ఉద్యోగులు తప్ప ఇతరులు ప్రవేశించే అవకాశమే లేదు. అందునా వర్సిటీ ఆవరణలో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. వర్సిటీ ఆవరణలోకి ప్రవేశ ద్వారాలు రెండు వుండగా రెండు చోట్లా ప్రాథమిక తనిఖీల తర్వాతే లోనికి అనుమతి లభించాలి. కానీ మంగళవారం రోజు ఇవేమీ కనిపించలేదు. మారణాయుధాలు ధరించిన వైసీపీ వర్గీయులు యథేచ్ఛగా వర్సిటీ ఆవరణలోకి వెళ్లి నానీపై దాడికి దిగి ఆయనను, గన్‌మ్యాన్‌ను గాయపరిచారు. వాహనాలు ధ్వంసం చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లున్న వర్సిటీ ప్రధాన ప్రవేశ ద్వారాల వద్ద సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ యూనిట్‌కు అనుసంధానం చేయకపోవడమే ఆశ్చర్యంగా వుంది.

నానీపై దాడి పర్యవసానాలను అదుపు చేయలేకపోయిన యంత్రాంగం

నానీపై దాడి జరిగిన అరగంట వ్యవధిలో చంద్రగిరి నియోజకవర్గవ్యాప్తంగా కనీసం ఐదారు వందలమంది కార్యకర్తలు వర్సిటీ వద్దకు చేరుకుని ప్రతిదాడులకు దిగారు. దాన్ని అంచనా వేసి అదుపు చేయడంలో కూడా పోలీసు యంత్రాంగం దారుణంగా విఫలమైంది. కేంద్ర బలగాలు తిరుపతిలోనే వున్నా కూడా సకాలంలో వర్సిటీ వద్దకు రప్పించలేని దుస్థితిలో అధికారులు వుండిపోయారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అభ్యర్థిపై మారణాయుధాలతో స్ట్రాంగ్ రూములున్న వర్సిటీ ఆవరణలో హత్యాయత్నం జరిగినా రెండున్నర గంటల తర్వాత గానీ ఎస్పీ అక్కడికి రాలేదు.

144 సెక్షన్ పొడిగించాల్సింది ఎపుడు?

పోలింగ్‌ను పురస్కరించుకుని ఈనెల 11వ తేదీ సాయంత్రం నుంచీ పోలింగ్ రోజు సాయంత్రం వరకూ సీఆర్‌పీసీ సెక్షన్ 144 విధిస్తున్నట్టు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ 11వ తేదీ ప్రకటించారు. అయితే బ్రాహ్మణ కాలవ, రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లి ఘటనలు పోలింగ్ రోజే జరిగాయి. దాన్ని దృష్టిలో పెట్టుకుని అయినా కనీసం చంద్రగిరి నియోజకవర్గంలోనూ, దానికి సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూములున్న మహిళా వర్సిటీ ప్రాంతంలోనూ 144 సెక్షన్ అమలును పొడిగించి వుండాల్సింది. అధికారులు ఆ జాగ్రత్త కూడా పాటించకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. జరగాల్సిందంతా జరిగాక ఆలస్యంగా మేలుకొని మంగళవారం సాయంత్రం పొడిగిస్తున్నట్టు ప్రకటించారు.

స్పెషల్ బ్రాంచి, ఇంటెలిజెన్స్ విభాగాలు ఏం చేస్తున్నట్టు?

జిల్లాలో పోలీసు శాఖకు అనుబంధంగా స్పెషల్ బ్రాంచి పనిచేస్తుంది. ఈ విభాగం ఎన్నికల సమయంలో ముఖ్యంగా ఘర్షణాత్మక పరిస్థితులున్నపుడు ప్రధాన పార్టీల నేతల కదలికలను, ఎత్తుగడలను ఎప్పటికప్పుడు పసిగట్టి ఎస్పీని హెచ్చరించాలి. కానీ అలాంటిదేమీ నాలుగు ఘటనల్లో జరగలేదు. స్వతంత్రంగా పనిచేసే ఇంటెలిజెన్స్ విభాగంతో కూడా జిల్లా ఎస్పీ సమన్వయంతో సమాచారం ఇచ్చిపుచ్చుకోవాల్సి వుంటుంది. ఆ విభాగం పనితీరు కూడా ఈ సందర్భంగా ప్రశ్నార్థకమవుతోంది.

స్ట్రాంగ్ రూముల ఏర్పాటుకు స్థల ఎంపికపై విమర్శలు

ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూముల ఏర్పాటుకు స్థలాన్ని ఎంపిక చేయడమే సరైంది కాదన్న వాదన వినిపిస్తోంది. పద్మావతీ వర్సిటీ విశాలమైంది, అనువైన భవనాలు కలిగివున్నదీ అయినప్పటికీ ఇతర అంశాలను అధికారులు పరిగణనలోకి తీసుకోలేదు. వర్సిటీ ప్రహరీ ఆనుకునే తుమ్మలగుంట గ్రామం వుంది. అది వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్ రెడ్డి స్వస్థలం. వారికి అక్కడ గట్టి పట్టుంది. పది నిమిషాల వ్యవధిలో వెయ్యిమందిని పోగేసే పరిస్థితి వుంది. అలాగే వర్సిటీకి చేరువగానే టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ నివాసం వుంటున్నారు. ఆయనకూ స్థానికంగా ప్రాబల్యం వుంది. ఒక్క పిలుపుతో స్వల్ప వ్యవధిలో వెయ్యిమందిని రప్పించే జనబలముంది. ఉద్రిక్తతలు రాజ్యమేలే ఈ నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్ రూమ్‌ను పద్మావతీ వర్సిటీలో కాకుండా మరో చోట మరింత భద్రతతో ఏర్పాటు చేసి వుండాల్సిందన్న వాదన వుంది.

నానీ గన్‌మ్యాన్ దుండగులపై కాల్పులు జరిపివుంటే?

పద్మావతీ వర్సిటీ ఆవరణలో మంగళవారం నానీపై వైసీపీ వర్గీయులు మారణాయుధాలతో దాడి చేసినపుడు ఆయన గన్‌మ్యాన్ ధరణి నిబంధనలు పాటించారు. తొలుత గాల్లోకి కాల్పులు జరిపారు. అయితే వెనక్కి తగ్గని వైసీపీ వర్గీయులు నేరుగా గన్‌మ్యాన్‌పైనే దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అలా కాకుండా గన్‌మ్యాన్ నేరుగా దాడి చేసిన వారిపై కాల్పులు జరిపివుంటే ఎన్ని మరణాలు సంభవించివుండేవి? తర్వాత పర్యవసానాలు ఎలా వుండేవి? అన్న ప్రశ్నలకు సమాధానాల్లేవు.

చంద్రగిరి ఆర్వో ఏం చేస్తున్నారు?

జిల్లా మొత్తం మీద చంద్రగిరి నియోజకవర్గం సమస్యాత్మకం. ఈ విషయం అటు పోలీసు రికార్డులు, ఇటు ఎన్నికల రికార్డులూ వెల్లడిస్తున్నాయి. ఆ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా తిరుపతి ఆర్డీవో వ్యవహరిస్తున్నారు.నియోజకవర్గ పరిస్థితులకు అనుగుణంగా ముందు జాగ్రత్తలు తీసుకోవడం, జిల్లా యంత్రాంగానికి ముందస్తు అంచనా నివేదికలు అందజేయడం ఆ అధికారి బాధ్యత. పోలింగ్ రోజు ఘటనలను బట్టి పోలీసు అధికారులతో సమీక్షించడం, ఘర్షణల పర్యవసానాలను అంచనా వేయడం, తదనుగుణంగా ముందస్తు చర్యలు తీసుకోవడం కూడా ఆ అధికారి బాధ్యత. అయితే చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి ఆర్వో ప్రేక్షకపాత్ర పోషించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నామినేషన్ల దాఖలు సందర్భంగా కూడా ఆర్వో కార్యాలయం వద్ద ఉద్రిక్తత ఏర్పడడం, పోలీసులు లాఠీఛార్జి జరపాల్సి రావడం, ఎమ్మెల్యే చెవిరెడ్డి వాహనంపై దాడి జరగడం తెలిసిందే. అప్పట్లో కూడా ఆర్వోరి సరైన చర్యలు, ముందు జాగ్రత్తలు తీసుకోలేదని, ప్రణాళికాబద్ధంగా వ్యవహరించలేదన్న ఆరోపణలు వచ్చాయి.

పలు గ్రామాల్లో కొనసాగుతున్న ఉద్రిక్తతలు

చంద్రగిరి నియోజకవర్గంలో ఇప్పటికీ పలు గ్రామాల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. టీడీపీ అభ్యర్థి నానీపై జరిగిన హత్యాయత్నానికి ప్రతీకార దాడులు జరిగే ప్రమాదం లేకపోలేదు. ఇరువైపులా అభ్యర్థులకు ప్రమాదం వెన్నంటే వుంది. అనుచర గణం, గన్‌మెన్ లేకుండా ఇరువురూ స్వేచ్ఛగా బయట తిరగలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ ప్రమాదం వారి కుటుంబ సభ్యులకు కూడా పొంచి వుంది. అలాగే బ్రాహ్మణ కాలవ, రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లి, పద్మావతీ వర్సిటీ ఘటనలకు సంబంధించిన కేసుల్లో జరిగే అరెస్టులు కూడా ఆయా గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులను సృష్టించనున్నాయి. కఠినంగా వ్యవహరించని పక్షంలో ప్రతీకార దాడులు జరిగే అవకాశాలున్నాయి.

నానీపై హత్యాయత్నం చేయించిందెవరు?

చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై మంగళవారం మధ్యాహ్నం జరిగిన హత్యాయత్నం వెనుక వున్న కీలక వ్యక్తులు ఎవరో ఇప్పటికే వెల్లడైంది. రామచంద్రాపురం మండలానికి చెందిన వైసీపీ ముఖ్యనాయకులు వల్లేటి భానుకుమార్‌రెడ్డి, గణపతిరెడ్డి ఈ దాడిలో కీలకంగా పాల్గొన్నట్టు పోలీసులు గుర్తించారు. వారితో పాటు వారి అనుచరులు పాల్గొన్నట్టు వీడియో ఫుటేజీలు కూడా పోలీసులకు లభ్యమయ్యాయి. అయితే వారితో దాడి చేయించింది ఎవరన్నది ప్రశ్నగా మారింది. ఏ కారణాలతో వారు మారణాయుధాలతో దాడికి దిగారు? ఎవరి కోసం అంత రిస్కు తీసుకున్నారు? దాడి వెనుక ముందస్తు ప్రణాళిక వుందా? దాడికి పాల్పడిన వారికి భారీగా లబ్ది చేకూరే ప్యాకేజీ వంటిదేమైనా వుందా? అన్న ప్రశ్నలకు సమాధానాలు దొరకాల్సి వుంది.

పులిపర్తి నానీకి నేతల పరామర్శ



నానీని పరామర్శిస్తున్న అమర్, దగ్గుమళ్ల

పలమనేరు, మే 15: తిరుపతిలో మంగళవారం వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిని బుధవారం పలమనేరు, పూతలపట్టు అభ్యర్థులు అమరనాథరెడ్డి, మురళీ మోహన్, చిత్తూరు పార్లమెంట్ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు తదితరులు పరామర్శించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు హేయమైన చర్యగా పేర్కొన్నారు. పోలీసులు వైఫల్యం వల్లే ఈ దాడి జరిగిందన్నారు. దాడిచేసిన వారిని వెంటనే అరెస్టుచేయాలని డిమాండు చేశారు.

స్విమ్స్ నుంచి డిశ్చార్జి

తిరుపతి(వైద్యం), మే 15 : వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీని బుధవారం డిశ్చార్జి చేశారు. భుజంపై తగిలిన గాయం ఇంకా పూర్తిగా నయం కాలేదని కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు సూచించారు. ఇంటివద్ద నానీని వందలాదిమంది టీడీపీ శ్రేణులతో పాటు సీపీఐ నేత నారాయణ, సినీ నటుడు శివాజీ తదితరులు పరామర్శించారు.

నానీపై హత్యాయత్నం కేసులో ఐదుగురు అదుపులోకి

తిరుపతి(నేరవిభాగం)/రామచంద్రాపురం, మే 15: పులివర్తి నానీపై హత్యాయత్నం కేసులో ఎంఆర్‌పల్లి పోలీసులు బుధవారం ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.ప్రధాన నిందితులుగా గుర్తించిన రామచంద్రాపురం జడ్పీటీసీ డిల్లీరాణి భర్త భానుకుమార్ రెడ్డి, నడవలూరు సర్పంచ్ గణపతి రెడ్డి కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. దాడికి పాల్పడిన వారందరూ లింగేశ్వరనగర్ సర్పంచ్ కోటి ఇంటి వద్ద సెంట్రింగ్ పనివారుగా గుర్తించినట్లు సమాచారం. తిరుపతి, రామచంద్రాపురం పోలీసులు బుధవారం అనుపల్లిలో 12మందిని అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం తిరుపతికి తరలించారు.వారిలో ఎనిమిది మందిని విడిచిపెట్టి నలుగురిని విచారిస్తున్నట్లు సమాచారం. మహిళావర్సిటీ వద్ద మంగళవారం పోలీసు వాహనాన్ని ధ్వంసం చేసిన ఘటనకు సంబంధించి దాదాపు 10 మందిని సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు గుర్తించారు.

చెవిరెడ్డి రాకతో ఎంఆర్‌పల్లి స్టేషన్ వద్ద ఉద్రిక్తత

తిరుపతి(నేరవిభాగం), మే 15 : టీడీపీ అభ్యర్థి నానీపై హత్యాయత్నం కేసులో ఎంఆర్‌పల్లి పోలీసులు కొంతమంది వైసీపీ కార్యకర్తలను బుధవారం స్టేషన్‌కు తీసుకొచ్చారు. కేసులో ఐదుగురి పేర్లు చూపించి 11 మందిని ఎందుకు తీసుకొచ్చారంటూ ప్రశ్నించేందుకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వైసీపీ అభ్యర్థి మోహిత్ రెడ్డి బుధవారం రాత్రి స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అక్కడ భారీఎత్తున పోలీసులను మొహరింపజేయడంతో స్టేషన్ వద్ద పరిస్థితి కొంత ఉద్రిక్తంగా మారింది. గంట తరువాత చెవిరెడ్డికి ఏఎస్పీ కులశేఖర్ సర్ది చెప్పగా వారక్కడినుంచి వెళ్లిపోవడంతో పరిస్థితి సద్దుమణిగింది.

కుప్పంలో రైతు హత్య

కుప్పం, మే 15: కుప్పంలో రైతు హత్యకు గురయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. కుప్పం మండలం పెద్దబంగారునత్తం గ్రామానికి చెందిన మణి (50) తనకున్న ఎకరం పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వర్షాలు లేక నీటి కొరత ఏర్పడి వ్యవసాయం భారంగా మారడంతో దానితోపాటు కూలీ పనులకు సైతం వెళ్లేవాడు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున తన పొలంలో టమోటాలు తీసుకుని కుప్పం మార్కెట్టుకు బయలుదేరి వచ్చాడు. ఇలా వచ్చిన మణి, కుప్పం అండర్ బ్రిడ్జి సర్కిల్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఆర్‌అండ్‌బీ కార్యాలయం సమీపంలో శవమై తేలాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఆయన గొంతు కోసి హత్య చేశారు. డీఎస్పీ శ్రీనాథ్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. కేసు నమోదు చేసి మణి మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మణి హత్యకు గల కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. కాగా మణికి భార్య తులశమ్మ, ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తెకు ఇటీవలే వివాహం చేసి అత్తారింటికి పంపారు.



మణి (ఫైల్ ఫొటో)

కిడ్నాప్ కేసులో 23 మంది వైసీపీ శ్రేణులపై కేసు

ప్రాణరక్షణ కల్పించాలని సదుం పోలీసులకు ఫిర్యాదు

పుంగనూరు, మే 15: సదుం మండలం బూరగమంద పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ, బీజేపీ తరపున పోలింగ్ ఏజెంట్లుగా కూర్చోకుండా సోమవారం తెల్లవారుజామున కిడ్నాప్ చేసి గాయపరచిన 23మంది వైసీపీ శ్రేణులపై మంగళవారం ఏఎస్ఐ ఎస్.షామీర్‌బాషా కేసు నమోదు చేశారు. ఎన్నికల పోలింగ్ రోజున జరిగిన ఈఘటనపై మాజీ సీఎం, రాజంపేట పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, పుంగనూరు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సదుంమండలం గాదివారిపల్లెకు చెందిన పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు జి.సుబ్బరాజు ఫిర్యాదు మేరకు 23మందిపై కేసు నమోదు చేశారు. వైసీపీ నేతలనుంచి తమకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని ఆయన కోరారు. ఈ మేరకు వైసీపీ నాయకులు ఎ.రెడ్డెప్పరెడ్డి, పి.వంశీకుమార్‌రెడ్డి, రోహన్ అలియాస్ లాడెన్, ఉదయ్‌కుమార్, చీనేపల్లె మనోజ్, డి.గణేశ్, డి.భగీరథరెడ్డి, పి.గుణశేఖర్,ఎం.మునిరెడ్డి, ఎన్.మునిరాజ, పి.రెడ్డిప్రసాద్, రమేశ్‌రెడ్డి, ఎం.నాగరాజ, జి.రాజేశ్, పి.మల్లికార్జున, ఎం.వినాయక, పి.రాజేంద్ర, ఎం.చిన్నయ్య, ఎం.కిరణ్‌కుమార్, ఎ.దామోదర్‌రెడ్డి, ఎం.శివారెడ్డి, జి.విజయభాస్కర్, జి.కృష్ణయ్యతో పాటు మరో ఎనిమిది మందిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఇంతవరకు ఎవరినీ అరెస్టు చేయలేదని సమాచారం.

బీజేపీ ఏజెంట్‌ను బెదిరించిన రౌడీషీటర్‌పై చర్యలు తీసుకోండి

● ఎస్పీకి ఫోన్‌చేసిన మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

పుంగనూరు, మే 15: పుంగనూరులో బీజేపీ పోలింగ్ ఏజెంట్‌గా ఉన్న వివేకానందను ఫోన్‌లో బెదిరించిన వైసీపీకి చెందిన రౌడీషీటర్ చెంగలాపురం సూరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ మణికంఠకు బుధవారం మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. రహ్మత్‌నగర్ పోలింగ్ బూత్‌లో వైసీపీకి వ్యతిరేకంగా తోట వివేకానంద ఉంటూ పోలింగ్ అనంతరం ఇంటికి వెళ్లగా చెంగలాపురం సూరి ఫోన్ చేసి దుర్భాషలాడుతూ తీవ్రంగా బెదిరించినట్లు బీజేపీ నేతలు మాజీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కలికిరిలో ఉన్న ఆయన్ను బాధితుడు వివేకానంద, పుంగనూరు బీజేపీ ఇన్‌చార్జి మదన్‌మోహన్‌బాబు, నాయకులు నరసింహులు, మఠంబాబు, రాజాశెట్టి తదితరులు కలిసి బెదిరింపులపై వివరించారు. ఈసందర్భంగా కిరణ్ మాట్లాడుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారా, ఎందుకు బెదిరించారు అని ఆరా తీసి ఎవరూ భయపడకండి తాను అండగా ఉంటానని భరోసానిచ్చారు. మంగళవారం సీఐ రాఘవరెడ్డికి ఫిర్యాదు చేశామని, ఇంతవరకు ఎలాంటి చర్య తీసుకోలేదని చెప్పడంతో ఎస్పీ మణికంఠకు కిరణ్ ఫోను చేశారు. రౌడీషీటర్ బెదిరించిన ఘటనలో ఆధారాలు ఉన్నాయని, వెంటనే తగిన చర్యలు తీసుకుని కేసు నమోదు చేసి బీజేపీ కార్యకర్తకు రక్షణ కల్పించాలని మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు.

ఏజెంట్‌ను బెదిరించడం అమానుషం

పుంగనూరులో రాజంపేట ఎంపీ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తరపున పోలింగ్ ఏజెంట్‌గా కూర్చున్న వివేకానందను రౌడీషీటర్ సూరి బెదిరించడాన్ని బీజేపీ నాయకులు ఖండించారు. పుంగనూరులో బుధవారం ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మఠంబాబు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు మీడియాతో మాట్లాడారు. వివేకానందకు ఫోన్‌చేసి అంతు చూస్తానని, ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఇబ్బందులు తప్పవని హెచ్చరించడం దారుణమన్నారు. వైసీపీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలు, అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, బీజేపీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొడితే సహించేదిలేదని, ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టన్నారు. ప్రజల మద్దతుతో గెలవాలి తప్ప హింసకు పాల్పడటం, బెదిరించడం మంచిది కాదని హితవు పలికారు. చెంగలాపురం సూరిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఏనుగుల దాడిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

సదుం, మే 15: సదుం మండలం జోగివారిపల్లె పంచాయతీ బత్తలవారపల్లె అటవీ శివారు ప్రాంతంలోని మామిడి తోటల్లో ఏనుగుల దాడిలో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. బుధవారం తెల్లవారుజామున జంట ఏనుగుల దాడిలో బాబురెడ్డి, చిరంజీవిరెడ్డి పొలాల్లోని విద్యుత్తు స్తంభాలు పడిపోయాయి. ఈశ్వర్ రెడ్డి తోటలోని డ్రిప్ పరికరాలు తొక్కేశాయి. పల్లెచుట్టూ మామిడి తోటలు, సమీపంలోని చెరువులో నీరు అధికంగా ఉండడంతో తరచూ ఏనుగుల సంచారం చేస్తూ ఉండడంతో పొలాల వద్దకు పగలు వెళ్లాలన్నా భయపడే పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



యువకుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె టౌన్, మే 15: కుటుంబ సమస్యలతో ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. మండలంలోని గంగాపురంపల్లెకు చెందిన వేణు కుమారుడు మధుసూదన్(21) బుధవారం ఇంట్లోనే పురుగుమందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబీకులు అతడిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించడంతో తేరుకున్నాడు. కాగా కుటుంబ సమస్యలే ఇందుకు కారణమని సమాచారం.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, మే 15: పట్టణంలో బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. షైకావీధికి చెందిన బాలిక (19) మంగళవారం చెత్తపడేయడానికి ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదని ఆమె తండ్రి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసుపై దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు టూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, మే 15: స్థానిక శివాజీనగర్‌కు చెందిన షేక్ జలాలుద్దీన్ అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందడంతో బుధవారం కేసు నమోదు చేసినట్లు మదనపల్లె టూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. మంగళవారం తన సోదరుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడని నసీరుద్దీన్ ఫిర్యాదు చేశాడన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

మదనపల్లె అర్బన్, మే 15: ఈ నెల 3న జరిగిన సాంబశివ (39)అనే వ్యక్తిపై కత్తితో దాడి చేసిన కేసులో నిందితుడు సయ్యద్ హుసేన్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు కొద్దిరోజుల క్రితం నీరుగుట్టవారిపల్లెకు చెందిన సాంబశివ, బండిలే గిరి గొడవ పడ్డారు. ఈ విషయమై బడిలే గిరి బావమరిది సయ్యద్ హుసేన్ సాంబశివపై కత్తితో దాడి చేసి తలపై, డొక్కలో పొడిచి గాయపర్చాడు. ప్రస్తుతం సాంబశివ బెంగళూరులో చికిత్స పొందుతు న్నాడు. బుధవారం చౌడేశ్వరి నగర్‌లో ఉన్న నిందితుడు సయ్యద్ హుసేన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ వివరించారు.

అసాంఘిక శక్తుల అడ్డా.. సంత మైదానం

పీలేరు, మే 15: పీలేరు పట్టణం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని వారపు సంత ప్రాంగణం అసాంఘిక శక్తుల అడ్డాగా మారుతోంది. వారపు సంత జరిగే మంగళవారం మినహా మిగిలిన రోజుల్లో అక్కడ రేయి, పగలు తేడా లేకుండా మందుబాబులు, ఆకతాయిల ఆగడాలు ఎక్కువైపోయాయని ఇటీవలి కాలంలో పోలీసులుకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వారి ఆగడాల వల్ల సంత ప్రాంగణానికి ఆనుకుని ఉన్న పద్మావతి నగర్, ఆర్టీసీ నల్లగుట్ట ప్రాంతాల నుంచి పట్టణంలోకి వివిధ పనుల కోసం రాకపోకలు సాగించే మహిళలు, విద్యార్థినులు, చిన్నపిల్లలకు ఇబ్బందిగా ఉంటోందని స్థానికులు వాపోతున్నారు.

పీలేరు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వెనుక ఉన్న సువిశాల ప్రాంగణంలో వారపు సంత జరుగుతుంది. సంతకు వచ్చే వ్యాపారులకు నీడ, కూర్చునే సౌకర్యం కల్పించడం కోసం చాలా మంది దాతలు, పాలకవర్గం అందులో పలు చెట్లు నాటడమే కాకుండా సిమెంటు దిమ్మెలు నిర్మించారు. మంగళవారం మినహా ఆ ప్రాంగణంలో ఎటువంటి కార్యకలాపాలు జరగవు. ఇదే మందుబాబులు, ఆకతాయిలకు ఆలంబనగా మారింది. సాధారణ రోజుల్లో అటు వైపు ఎవరూ కన్నెత్తి చూడకపోవడంతో చాలా మంది మందుబాబులు దానిని తమ అడ్డాగా మలుచుకున్నారు. రేయి పగలు తేడా లేకుండా అక్కడ మందు సేవించడం, అటుగా వెళుతున్న వారిని అకారణంగా దుర్భాషలాడడం, మత్తు మీరితే దాడులకు పాల్పడడం చేస్తున్నారు. ప్రశ్నించిన వారిపై మందు బాటిళ్లతో దాడి చేసేందుకు కూడా వెనుకాడడం లేదని, రాత్రిళ్లు వారి ఆగడాలు మరీ పెచ్చుమీరిపోతున్నాయని సంత చుట్టుపక్కల వారు ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం సేవించి ఆ బాటిళ్లను పగలగొట్టి ఇళ్లపైకి విసరడం, ఇళ్ల ముందు పడేయడం వంటి విపరీత చర్యలకు పాల్పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో సంత ప్రాంగణంలో గంజాయి అమ్మకాలు పెరగడం, గంజాయి సేవించిన వారు అక్కడే మత్తులో రెండు, మూడు రోజులపాటు పడి ఉండడం ఎక్కువైపోయిందని వారు తెలిపారు.



పీలేరులో వారపు సంత ప్రాంగణం

గస్తీ ఏర్పాటు చేస్తాం

వారపు సంత ప్రాంగణంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు మాకు సమాచారం ఉంది. ఎన్నికల విధుల్లో ఉండడం వల్ల ఇటీవలి కాలంలో అటువైపు గస్తీ తగ్గించాం. ఇకపై రాత్రి పూట గట్టి గస్తీ ఏర్పాటు చేస్తాం. అటువైపు విద్యార్థులు వెళ్లకుండా నిరోధించేందుకు కళాశాలల యజమాన్యాలతో కూడా మాట్లాడుతాం.

- నరసింహుడు, ఎస్ఐ

విద్యార్థులు సైతం...

సంత ప్రాంగణం ఆర్టీసీ బస్టాండుకు చేరువగా ఉండడం, బస్టాండు సమీపంలో పలు విద్యాసంస్థలు ఉండడంతో ఖాళీ సమయాల్లో విద్యార్థులు కూడా అక్కడ ఎక్కువగా చేరి గ్యాంగ్ వార్లకు పాల్పడుతున్నారని స్థానికులు తెలిపారు. ఒక్కోసారి రెండు, మూడు కళాశాలలకు చెందిన విద్యార్థులు అక్కడ గుమిగూడి ఒకరిపై మరొకరు భౌతిక దాడులకు పాల్పడుతుంటారని వారు తెలిపారు. విద్యార్థులు సంత ప్రాంగణంలో స్కూటర్లతో విన్యాసాలు చేయడం, అప్పుడప్పుడు మద్యం సేవించడం వంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. సంత రోజు గస్తీ నిర్వహించే పోలీసులు, మిగిలిన రోజుల్లో ఏదైనా ఫిర్యాదు అందితే తప్ప అటువైపు రావడం లేదని, అలా కాకుండా ప్రతిరోజూ రాత్రిళ్లు అక్కడ గస్తీ నిర్వ హిస్తే అసాంఘిక కార్యకలాపాలు తగ్గుతాయని స్థానికులు కోరుతున్నారు.

మదనపల్లెలో ముస్లింల మొగ్గు.. ఎటువైపు?

మదనపల్లె టౌన్, మే 15: మదనపల్లె నియోజకవర్గంలో ముస్లింలు ఏ పార్టీ వైపు మొగ్గు చూపారనేది ఇప్పుడు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. మదనపల్లె నియోజకవర్గంలో 2,66,950 ఓట్లు ఉండగా ఇందులో ముస్లింల ఓట్లు 19.8 శాతం(43వేలు) వీరిలో అధికభాగం పట్టణంలోని నివశిస్తున్నారు. సోమవారం జరిగిన పోలింగ్ సరళిని ఒకసారి పరిశీలిస్తే ఉదయం 9 గంటలకు 10.08శాతం. 11గంటలకు 24.05శాతం ఓట్లు పోల్ కాగా, మధ్యాహ్నం ఒంటి గంటకు 35.2శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. దీంతో అప్రమత్తమై ఇరు ప్రధాన పార్టీల నాయకులు ఉరుకులు పరుగులెత్తారు. ఓ వైపు టీడీపీ నాయకులు గ్రామాలు, పట్టణంలోని ద్వితీయస్థాయి నాయకులను అప్రమత్తం చేయడం, మరో వైసీపీ నాయకులు వలంటీర్లను అప్రమత్తం చేసి ఓటర్ల ఇళ్ల వద్దకు పరుగులు తీయించారు. పోలింగ్ తక్కువగా ఉందని, ఇలా అయితే ఓటమి ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరు పార్టీలు ఆందోళన చెందాయి. మధ్యాహ్నం 3 నుంచి 4గంటలకు పోలింగ్ 53.71శాతానికి ఎరగడంతో కొంత ఆందోళన తగ్గింది. కాని 4 గంటల నుంచి ఐదు గంటలకు వరకు కేవలం 11శాతం మాత్రమే పోలింగ్ జరగడంతో 64.09శాతం ఓట్లు పోలయ్యాయి. పరిస్థితి ఇలాగే వుంటే ఓటమి అంచుల్లో ఇరుక్కుంటామని ఇరు పార్టీల అగ్రనేతలు ద్వితీయ, తృతీయశ్రేణి నాయకులను పరుగులు పెట్టించారు. ఏమైందో ఏమో కాని కేవలం ఒక్క గంటలోనే 11శాతం పోలింగ్ జరిగి ఎట్టకేలకు 75.11శాతం ఓట్లు పోలయ్యాయి. దీంతో ఇరు పార్టీల నాయకులు ఊపిరి పీల్చుకున్నారు. కాని ఎక్కువగా సైలెంట్ ఓటింగ్ జరగడంతో పట్టణంలోని ముస్లిం ఓటర్లు ఎటువైపు మొగ్గుచూపారో తెలియని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా టీడీపీ, వైసీపీ రెండు పార్టీలు ముస్లిం అభ్యర్థులనే బరిలోకి దించడం, ఆ వర్గ ఓటర్లను ఎవరు ఎక్కువగా ఆకర్షించారో దిక్కుతోచక, అంచనాలను లెక్కవేయలేక విశ్లేషకులు జుట్టు పీక్కొంటున్నారు. వారి తమకే ఎక్కువగా పోలయ్యాయని వైసీపీ నేతలు ధీమాగా వున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో బలిజ సామాజిక వర్గం ఓట్లు 40,052లు అధికభాగం ఎన్డీఏ అభ్యర్థులకే పోలయ్యాయని విశ్లేషకులు అంటున్నారు. మిగిలిన బీసీ ఓటర్లు సైతం కూటమి వైపు మొగ్గుచూపారని, కేవలం రెడ్డి, ఎస్సీ, క్రిస్టియన్ సామాజిక వర్గాలే వైసీపీకి మద్దతు పలికాయని కొందరు అంటున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే 3శాతం ఓట్లు ఎక్కువగా పోలవడంతో కూటమి అభ్యర్థికే కలసి వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. ముఖ్యంగా మదనపల్లె పట్టణంలో ఈ సారి 4శాతం పోలింగ్ పెరగడంతో టీడీపీ వైపే పట్టణ ముస్లింలు మొగ్గు చూపారని తెలుస్తోంది. దీంతో ఎన్డీఏ అభ్యర్థి గెలుపుపై ఎక్కువగా ఆశలు పెట్టుకున్నారు.

ప్రభుత్వంపై వ్యతిరేకతతో పెరిగిన ఓటు శాతం

- అత్యధిక మెజార్టీతో గెలుస్తున్నాం..
- హామీలన్నీ నెరవేరుస్తా
- టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, మే 15: వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకతతోనే తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఓటు శాతం భారీగా పెరిగిందని టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి తెలిపారు. ములకలచెరువులోని టీడీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ హయాంలో తంబళ్లపల్లె నియోజకవర్గంలో అన్యాయా లు, అక్రమాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలు ఓట్లు వేశారన్నారు. దీంతో జిల్లాలోనే తంబళ్లపల్లెలో ఓటు శాతం పెరిగిందన్నారు. వైసీపీ ఓటర్లకు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా ప్రజలు మంచికి ఓట్లేశారన్నారు. తంబళ్లపల్లెలో అత్యధిక మెజార్టీతో తాను గెలుపొందడం ఖాయమన్నారు. రాష్ట్రంలో కూడా కూటమి ప్రభుత్వం ఏర్పాటై టీడీపీ అధినేత చంద్ర బాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధికి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తానన్నారు. జూన్ 5వ తేదీ నుంచి ప్రణాళికలు సిద్ధం చేసి రైతులు, యువతను ఆదుకుంటానన్నారు. రైతులను రాజులుగా చేసి యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్నా రు. స్వతహాగా వచ్చి ఓట్లు వేసిన తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మండలాల వారీగా పోలింగ్ సరళి గురించి నాయకులు, కార్యకర్తలతో చర్చించారు.



పోలింగ్ సరళిపై నాయకులతో చర్చిస్తున్న టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి

తంబళ్లపల్లెలో పోటెత్తిన ఓటర్లు

- అత్యధికం కురబలకోట..
- చిట్టచివరన ములకలచెరువు

ములకలచెరువు, మే 15: తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఓటర్లు పోటెత్తారు. జిల్లాలోనే అత్యధికంగా 83.13 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2,24,802 మంది ఓటర్లకు గానూ 1,86,894 ఓట్లు పోలయ్యాయి. పురుషులు 92,970 మంది, మహిళలు 93,920 మంది, ఇతరులు నలుగురు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కురబలకోట మండలంలో అత్యధికంగా 87.80 శాతం పోలింగ్ నమోదు కాగా, అతి తక్కువగా ములకలచెరువులో 76.38 శాతం నమోదైంది. మండలాల వారీగా పోలైన ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి. కురబలకోట మండలంలో 35,316 ఓట్లకు గానూ 31,008 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 87.80 శాతం పోలింగ్ నమోదైంది. పెద్దతిప్పసముద్రం మండలంలో 41,466 ఓట్లకు గానూ 35,731 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 86.16 శాతం పోలింగ్ నమోదైంది. తంబళ్లపల్లె మండలంలో 32,468 ఓట్లకు గానూ 27,271 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 83.00 శాతం పోలింగ్ నమోదైంది. పెద్దమండ్యం మండలంలో 27,691 ఓట్లకు గానూ 22,822 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 82.41 శాతం పోలింగ్ నమోదైంది.

బి.కొత్తకోట మండలంలో 50,231 ఓట్లకు గానూ 41,179 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 81.97 శాతం పోలింగ్ నమోదైంది. ములకలచెరువు మండలంలో మొత్తం 37,810 మంది ఓటర్లుకు గానూ 28,883 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 76.38 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల అధికారులు తెలిపారు.

కనీస వసతులు లేని కలకడ బస్టాండు!



పార్కింగ్ లేకపోవడంతో బస్టాండులోనే నిలిపిన వాహనాలు

కలకడ, మే 15: స్థానిక ఆర్టీసీ బస్టాండులో కనీసవసతులు లేక ప్రయాణి కులు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రతి రోజు ఆర్టీసీ బస్టాండు నుంచి వందలాది మంది విద్యార్థులు, ప్రజలు ఈ బస్టాండు నుంచి ఇతర ప్రాంతా లకు వెళ్లి వస్తుంటారు. అయితే వారందరికీ తగినట్లు ఇక్కడ సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నిర్వహణ లేకపోవడంతో బస్టాండులోని మరుగుదొడ్లు, మూత్రశాలలు దుర్గధం వెలువరిస్తున్నాయి. దీంతో పురుషులు గత్యంతరం లేక ఆర్టీసీ బస్టాండు పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని మూత్రశాలగా ఉపయోగిస్తుండగా, మహిళలకు అలాంటి అవకాశం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య నిర్వహణ లేకపోవడంతో చెత్తచెదారం పేరుకుపోయి, రాత్రివేళలో దోమల బెడద ఎక్కువగా ఉంటోందని ప్రయాణికులు వాపోతున్నారు. బస్సులు నిలిచేచోట కంకర తేలింది ట్రాఫిక్ కంట్రోలర్ లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలు ఎక్కువగా ప్రయాణికులను తరలిస్తున్నాయి. దీంతో ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతోంది. షాపింగ్ కాంప్లెక్స్ ద్వారా ఆర్టీసీకి ప్రతి నెల వేలాది రూపాయల ఆదాయం చేకూరుతున్నా బస్టాండులో కనీస వసతు లు కల్పించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఈ విషయమై పీలేరు డిపో మేనేజర్ బండ్ల కుమార్ వివరణ కోరగా, కలకడ బస్టాండులో నెల కొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తాం. ఈ పనులకు సంబంధించి టెండర్లు పూర్తి అయినట్లు తెలిపారు. అలాగే ప్రయాణికులకు అవసరమైన పనులను ప్రారంభించి నెల చివరికి పూర్తి చేస్తామని తెలిపారు.



పేరుకుపోయిన చెత్తాచెదారం

స్వీపర్ల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివ

పీలేరు, మే 15: ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాల స్వీపర్ల జీతాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులోని ఏఐటీయూసీ కార్యా లయంలో బుధవారం ఆయన విలే ఖరులతో మాట్లాడారు. ప్రభుత్వం స్వీపర్లకు నెలకు కేవలం రూ.6 వేల వేతనం ఇస్తోం దని, దానిని కూడా నెలనెలా చెల్లించకుండా ఆరు నెలలుగా పెండింగ్‌లో పెట్టిందని తెలిపారు. అసలే అరకొరా జీతాలతో రోజంతా పనిచేసే స్వీపర్లు, ఆ జీతం కూడా నెల నెలా రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న జీతాలతోపాటు స్వీపర్లకు యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన శూన్యమని, ఇప్పటికైనా పట్టించుకోకుండే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నరసింహులు, యశోదా, వెంకటరత్నమ్మ, పద్మావతి, రమాదేవి, సుమతి, రెడ్డమ్మ, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ ఇంటర్న్‌షిప్‌కు మిట్స్ విద్యార్థుల ఎంపిక



ఐఐటీ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన మిట్స్ విద్యార్థులు

కురబలకోట, మే 15: తిరుపతిలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన ఐఐటీ ఇంటర్న్‌షిప్‌కు ఐదుగురు మిట్స్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తెలిపారు. మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం ఈసీఈ విభాగానికి చెందిన కుమార్, లోకేశ్వర్, కావేరి, హర్షిక, దివ్య ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారు. వీరు 45 రోజుల పాటు వి.ఎల్.ఎస్.ఐ పరిశోధనలు చేస్తారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ళ, ప్రిన్సిపాల్ సి.యువరాజ్, విభాగాధిపతి రాజశేఖరన్ అధ్యాపకులు తదిత రులు అభినందించారు.

నేటి నుంచి బీసీజీ వ్యాక్సినేషన్

మదనపల్లె టౌన్, మే 15: 2025 నాటికి క్షయవ్యాధి నిర్మూలనలో భాగంగా టీబీ బాధితులకు, 60 ఏళ్ల పైబడిన వారికి గురువారం నుంచి బీసీజీ టీకాలు వేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా 18 ఏళ్ల పైబడిన క్షయవ్యాధి బాధితులు, మధుమేహులు, ధూమపానం చేసే వారికి బీసీజీ టీకాలు వేస్తారన్నారు. మూడు నెలల పాటు ప్రతి గురువారం గ్రామ, వార్డు సచివాలయాల్లో వైద్యసిబ్బంది ఈ టీకాలను వేస్తారన్నారు. ఈ విషయమై వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీలు ప్రజలకు వివరించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, హెచ్ఐవీ, క్యాన్సర్ వున్న వారికి బీసీజీ టీకాలు వేయరన్నారు. ప్రజలు అపోహలు వీడి వారి సవాలయ పరిధిలో వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బందిని కలవాలని డాక్టర్ శైలజ సూచించారు.

పీలేరు: టీబీ నిర్మూలనలో భాగంగా గురువారం నుంచి పీలేరు మండలంలో బీసీజీ టీకాల పంపిణీ ప్రారంభిస్తున్నట్లు వైద్యాధికారులు రమేశ్ రెడ్డి, కార్తీక్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి వెయ్యి మందిలో 20 మంది బీసీజీ టీకాలకు అర్హులని, ప్రస్తుతానికి పీలేరు మండలంలో 2246 మంది స్వచ్ఛందంగా టీకా వేయించుకునేందుకు సమ్మతి తెలియజేశారని వెల్లడించారు. వారందరికీ గురువారం నుంచి టీకా వేస్తామన్నారు. ఇంటింటి సర్వే చేసి టీకాలు అందజేస్తామన్నారు.

అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్‌కు ఘన నివాళి



కాటన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

వాల్మీకిపురం, మే 15: అపర భగీథుడు సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా బుధవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నివాళులర్పిరు. వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాటన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన సేవలను స్మరించుకున్నారు. అతివృష్టి, అనావృష్టితో ఇబ్బంది పడుతు న్న గోదావరి ప్రాంతాన్ని ధాన్యాగారంగా మార్చారన్నారు. వందలాది గ్రామాలకు సాగు తాగునీరు అందించిన ఘనత కాటన్‌కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్, ప్రిన్సిపాల్ ఉమా అమరేశ్వరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ జయంత్యుత్సవాలు

మదనపల్లె అర్బన్, మే 15: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహించే వాసవీమాత జయంత్యుత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవ, అభిషేకంతోపాటు ప్రత్యేక అలంకరణలతో పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అర్చకుడు సిఎస్ రామచంద్రశర్మ మహామంగళహారతి పట్టి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం వాసవీమాత, శ్రీలలితా సహస్రనామ పారాయణతోపాటు కుంకుమార్చన చేశారు. మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూనగంటి ఓంప్రకాష్, దేవతా సతీష్, సూరే గిరిధర్‌తోపాటు ఆర్యవైశ్య సంఘం సభ్యులు, వినాయక చవితి కమిటీ సభ్యులు, వాసవీ మహిళా సంఘం సభ్యులు, వాసవీ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



మదనపల్లె అర్బన్, మే 15: పట్టణంలోని కదిరిరోడ్డులో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఈ నెల 14 నుంచి 18 వరకు స్వామివారి 331వ ఆరాధనోత్సవాలు నిర్వ హిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పి. లక్ష్మీనారాయణాచారి, నవయుగ స్వర్ణకారు ల సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్య క్షుడు డాక్టర్ అప్పినిపల్లె భాస్కరాచారి తెలిపారు. ఈ నెల 17న ఆలయంలో వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ ట్రస్టు, నవ యుగ స్వర్ణకారుల సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘం మదనపల్లె సభ్యుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదానం నిర్వహించనున్న ట్లు వారు తెలిపారు. బుధవారం ఉదయం 5.30 గంటలకు సుప్రభాత సేవ, 9 గంటలకు నవగ్రహారాధన చేశారు. స్వామివార్లకు పంచామృతాభిషేకం అనంతరం నవగ్రహ హోమం చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు మహామంగళహారతితోపాటు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం 6 గంటలకు షోడశోపచార పూజ ప్రత్యేకంగా నిర్వహించారు.

ఇంటర్‌మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నిమ్మనపల్లి, మే 15: మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీలోని మోడల్‌స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మూర్తి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎంపీసీ. ఎంబైపీసీ. బైపీసీ, సీఈసీ గ్రూపులు వుండగా ఒక్కో గ్రూపునకు 40 సీట్లు ఉన్నాయన్నారు. ఈ నెల 25లోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 7, 8, 9 తరగతుల్లో పరిమిత సంఖ్యలో ఖాళీలు ఉన్నాయని ఆసక్తి కలిగిన విద్యార్థులు పని వేళల్లో పాఠశాలలో సంప్రదించాలని తెలిపారు.

మైనార్టీ బాలికల గురుకులంలో..

వాల్మీకిపురం: వాల్మీకిపురం పట్టణ సమీపంలోని తరిగొండ రోడ్డులో గల ఏపీ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి 5 నుంచి 8 తరగతులలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నవమల్లిక తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మైనార్టీ విద్యార్థినులకు ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా పాఠశాలలో చేరుటకు అవకాశం కల్పించినట్లు వివరించారు. దరఖాస్తులు, సర్టిఫికెట్ల ఫొటోస్టాట్ కాపీలను పాఠశాలలో నేరుగా గానీ రిజిస్టర్ పోస్టు ద్వారా కానీ ఈనెల 31లోపు అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 8712625052 నెంబరును సంప్రదించగలరన్నారు.

ఓటేయడానికి ఊరికెళితే ఇంట్లో దొంగలుపడ్డారు

మదనపల్లె అర్బన్, మే 15: ఓట్లువేయడానికి సొంతూరు వెళితే ఇంట్లో దొంగలుపడ్డారు. టూటౌన్ సీఐ యువరాజు కథనం మేరకు పట్టణంలోని నీరుగట్టువారిపల్లె, పుల్లారెడ్డి వీధికి చెందిన బషీర్ ఆటోడ్రైవర్. తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ నెల 11న కుటుంబ సభ్యులతో కలసి తంబళ్లపల్లె మండలం ఎన్పీ కుంటకు వెళ్లాడు. ఆ విషయం గమనించిన దుండగులు 12వ తేదీ రాత్రి ఇంట్లోకి ప్రవేశించి. పదివేలు నగదు, రెండు లక్షలు విలువచేసే నగలు అపహరించారని ఓట్ల తంతు ముగించుకుని 13వ తేదీ సాయంత్రం ఇంటికి వచ్చిన బషీర్ కుటుంబసభ్యులు గమనించారు. వెంటనే టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పరిశీలించిన సీఐ యువరాజు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.